

## నేటి రాత్రి నుంచి శ్రీవారి నిజరూప దర్శనం

ద్వారకాతిరుమల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సర్వా భరణ భూషితుడై గర్భాలయంలో ద్విమూర్తులుగా కొలువుతీరిన శ్రీవేంకటేశ్వరస్వామి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి నుంచి నిజరూపంలో దర్శనం ఇవ్వనున్నారు. ఏడాదికోమారు ఏ ఆభరణాలు, పుష్పాలు, ఇతర అలంకారాలు లేకుండా స్వామి దర్శనం ఇవ్వడం సంప్రదాయం. నేతి దీపపు కాంతుల నడుమ విరాజిల్లే స్వామిని తనివితీరా దర్శించేందుకు ప్రతి భక్తుడు ఉవ్విళ్లూరుతారు. గురువారం రాత్రి ఏడు గంటల నుంచి ముక్కోటి ఏకాదశి రోజు సాయంత్రం వరకూ ఈ దర్శనం లభిస్తుంది.

## నేడు చిన వెంకన్న గిరి ప్రదక్షిణ

రేపు ఉత్తరద్వారంలో శ్రీవారి దర్శనం

కాళ్లకూరు వెంకన్న ఆలయంలో ఏర్పాట్లు 6



## తప్పుడు వార్తల జగన్ మీడియాపై అంధుల నిరసన

ఏలూరులో కలెక్టరేట్ వద్ద నినాదాలు 7

# ఎకో సెన్సిటివ్ జోన్ వద్దు



- ఏర్పాటు చేస్తే ఇబ్బందులు
- కొల్లేరు రైతుల వ్యతిరేకత
- ఆకివీడులో ప్రజాభిప్రాయ సేకరణలో బైఠాయింపు
- సమస్యల ఏకరువు.. గత పరిహారం ఇవ్వలేదని వెల్లడి
- కలెక్టర్‌కు నివేదిస్తాం : అధికారులు



ప్రజాభిప్రాయ సేకరణలో అధికారుల ముందు బైఠాయించిన కొల్లేరు రైతులు

ఆకివీడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటు చేస్తే భార్యాభర్తలు కలిసి జీవించడానికి అనుమతులు పొందాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని కొల్లేరు రైతులు ఎద్దేవా చేశారు. కొల్లేరు అభయారణ్య ప్రతిపాదిత సున్నిత పర్యావరణ ప్రాంతంపై ఆకివీడు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ప్రజా అవగాహన సదస్సు జరిగింది. కొల్లేరు రైతులు నేల మీద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ఎకో సెన్సిటివ్ జోన్ పరిధి బౌండరీ నుంచి పది కిలోమీటర్లు అంటున్నారు. అంటే ఇది ఉండి, కాళ్ల మండలాల వరకు వెళ్లిపోతుంది. ఆకివీడు రైల్వేస్టేషన్‌తోపాటు అన్నీ ఈ పరిధిలోకి వస్తాయి. ఇదే జరిగే మా మనుగడే ప్రమాదంలో పడిపోతుంది' అంటూ జోన్‌ను వ్యతిరేకిస్తూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ పెదకాపవరం, చినకాపవరం, తరటావ, గుమ్ములూరు, సిద్ధాపురం, కోళ్ళపర్రు, ధర్మాపురం, దుంపగడప, ఆకివీడు, మాదివాడ, అజ్జమూరు, కుప్పనపూడి, అయి-భీమవరం, చెరుకుమిల్లి రెవెన్యూ గ్రామాలు ఈ పరిధిలోకి వస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు, జన జీవనానికి ఆటంకం కలుగకుండా ఉండేందుకు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు తెలిపారు. ఈ నివేదికను కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు. కైకలూరు అటవీ క్షేత్రాధికారి కేవీ రామలింగాచారి, సెక్షన్ అధికారులు శ్రీనివాసబాబు, సుజాత, నరసింహారావు, తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో డి.సుహాసిని, ఎస్ఐ హనుమంతు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### జోన్‌తో అభివృద్ధి ఉండదు



- ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుతో అభివృద్ధి ఉండదు. పరిశ్రమలకు అనుమతులు రావు. కొల్లేరు పరిధిలో ఇప్పటికే మూడు, ఐదు కాంటూరుతోనే ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు మరింత ఇక్కట్లు తప్పవు. భార్యాభర్తలు కలిసి ఉండడానికి అనుమతులు తీసుకోవాల్సి వస్తుంది.

\- భూపతిరాజు తిమ్మరాజు, కొల్లేరు రైతు సంఘ ప్రతినిధి

### వలసలు మొదలవుతాయి



- కొల్లేరును ఐదు నుంచి మూడో కాంటూరుకు కుదించాలి. ఇప్పటికే రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. జోన్ ఏర్పాటు చేస్తే మరిన్ని ఇబ్బందులు తప్పవు. అధికారుల కనుసన్నల్లో బతకాల్సి వస్తుంది. ఇప్పటికే అనేకమంది వలస వెళ్లిపోయారు. ఇప్పుడున్న వాళ్ల అదేదారి పడతారు.

\- బొల్లా వెంకట్రావు, రైతు, ఆకివీడు

### ఉపాధి కోల్పోతాం



- జోన్ ఏర్పాటుతో ఉపాధి కోల్పోతారు. ఇల్లు కట్టుకోవాలన్నా, చెట్లు కొట్టుకోవాలన్నా అధికారుల అనుమతులు తీసుకోవాలి. రహదారుల నిర్మాణాలు చేపట్టాలన్నా వారి చుట్టూ తిరగాలి. కాంటూరు పరిరక్షణకు మరో పది కిలోమీటర్ల మేర ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుతో ఉండి, కాళ్ళ మండలాలు ఈ పరిధిలోకి వస్తుండడంతో ప్రశ్నార్థకం కానుంది.

\- మోటుపల్లి రామవరప్రసాద్, రైతు, ఆకివీడు

### పిల్లలకు పెళ్లిళ్లు జరగవు



- గతంలో జిరాయితీ, సొసైటీ భూములను బాంబులతో పేల్చేయడంతో మా పొలాలు ఎక్కడున్నాయో తెల్సుకోలేక భూములు నష్టపోయాం. ఇప్పటి వరకూ వీటికి ఒక పైసా నష్టపరిహారం చెల్లించలేదు. కాంటూరు గుర్తించినప్పుడు మా గ్రామాల్లో పిల్లల పెళ్లిళ్ల సమ స్యగా మారింది. ఇప్పుడు జోన్ ఏర్పాటు చేస్తే ఇక పిల్లలకు పెళ్లిళ్ల జరగవు.

\- జేకే రాజు, రైతు, సిద్ధాపురం



ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో హెచ్‌ఎంపీవీ వైరస్ చికిత్స కోసం ఏర్పాటు చేసిన వార్డును పరిశీలిస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, వైద్యుల బృందం

# హెచ్‌ఎంపీవీ వైరస్‌తో భయమొద్దు

- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి..
- మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు
- ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో 22 పడకలతో ప్రత్యేక విభాగం ఏర్పాటు

ఏలూరు క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రబలుతున్న హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తి నిరోధానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ముందస్తుగా ఐసోలేషన్ వార్డులను, చికిత్స విభాగాలను ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేశారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో పది పడకలు ఒక భాగంలో, మరో పది మరో విభాగంలో, రెండు పడకలు ఐసీయూ విభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో హెచ్‌ఎంపీవీ వైరస్ చికిత్స కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యుల బృందం నోడల్ అధికారిణి డాక్టర్ గంగాభవాని, డాక్టర్ సుధాకర్, డాక్టర్ దీపక్‌కుమార్, డాక్టర్ హేమలత, డాక్టర్ శివరామ్, డాక్టర్ ఎం.శశిధర్ ఈ విభాగాలను పరిశీలించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రాజు మాట్లాడుతూ హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తి నిరోధానికి ఇప్పటికే ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఓపి విభాగాల్లో వివరిస్తున్నామన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, మాస్కులు ధరించాలని వ్యాధి కోసం భయపడాల్సిన అవసరం లేదని వైద్యుల సలహా మేరకే మందులను వాడాలే తప్ప సొంత నిర్ణయాలతో మందులను వాడకూడదన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావొద్దని సాధారణ సీజనల్ వ్యాధుల్లాగానే ఈ వైరస్ ఉంటుందని, వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని సూచించారు. ఆస్పత్రిలో ఈ వార్డుల్లో విద్యుత్, నీటి సరఫరా, శానిటేషన్, రోగులకు అవసరమైతే ముందస్తుగా ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్స్ ఏర్పాటుచేశామన్నారు. ప్రతి బెడ్‌కు ఒక ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని, పది వేల లీటర్ల లిక్విడ్ ఆక్సిజన్ సిద్ధంగా ఉంచామన్నారు. మరో 100 ఆక్సిజన్ సిలిండర్లు మూవింగ్ స్ట్రెచ్చర్లకు వినియోగించేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. వెంటిలేటర్లను అందుబాటులో ఉంచామన్నారు. వైద్యుల బృందం ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్కరు చొప్పున అన్ని విభాగాల వైద్యులు ఉన్నారని ల్యాబ్‌లో పరీక్షలు నిమిత్తం ఆర్టీపీసీఆర్ మిషన్ ఉందని, కిట్స్ త్వరలోనే వస్తాయని తెలిపారు.

## పనుల్లో అలసత్వం తగదు



మాట్లాడుతున్న ఎంపీ పుట్టా, చిత్రంలో జడ్పీ చైర్మన్ పద్మశ్రీ, నరసాపురం ఎమ్మెల్యే నాయకర్

7

- అధికారుల తీరుపై జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాల్లో ఎమ్మెల్యేల అసంతృప్తి

## చెత్త కొండలు

- పట్టణాల్లో గుట్టల్లా పేరుకుపోతున్నాయి..
- డంపింగ్ యార్డుల సమస్యతో సతమతం
- ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడే డంపింగ్..
- వెంటాడుతున్న కార్మికుల కొరత

6



## బతికుండగానే చంపేశారు!

పోలవరం పరిహారాన్ని నిలిపివేసిన అధికారులు

## కానిస్టేబుల్ ఎంపిక పోటీలో 313 మంది అర్హత

7





దర్భగూడెం వద్ద గట్టును తవ్వేసిన దృశ్యం

# గట్టు.. కొల్లగొట్టు!

## తరిగిపోతున్న చింతలపూడి కాల్వ గట్టు

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొల్లగొట్టిన అక్రమార్కులు
- కూటమి అధికారంలోకి వచ్చాకా ఆగని దందా
- పట్టని అధికార యంత్రాంగం

జీలుగుమిల్లి, జనవరి 8 : (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎత్తిపోతల కాల్వ గట్టు గత ప్రభుత్వం హయాంలో కొందరు అక్రమార్కులకు కాసులు కురిపించింది. సంపాదనే ధ్యేయంగా గట్టును కొల్లగొట్టారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తయితే మెట్ట ప్రాంతం సస్య శ్యామలంగా మారేది. నీటి కొరత సమస్య తీరేది. ఈ ఉద్దేశంతోనే గత టీడీపీ ప్రభుత్వం తన హయాంలో చింతలపూడి ప్రాజెక్టుపై దృష్టి సారించింది. ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా గుడ్డిగూడెం నుంచి వయా బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం మీదుగా జీలుగుమిల్లి మండలంలోని ముల్లగలంపల్లి, టి.గంగన్నగూడెం, దర్భగూడెం గ్రామాల్ని కలుపుతూ టి.నరసాపురం మీదుగా ఈ పథకం కాల్వ గట్టు పనులు పూర్తి చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పక్కన పెట్టింది. ఇదే అదనుగా మండలంలోని చింతలపూడి కాల్వ గట్టు మట్టిని కొందరు అక్రమార్కులు కొల్లగొట్టారు. గతం లో ఏర్పాటు చేసిన జాతీయ రహదారులకు సైతం మార్జిన్ వేసేందుకు టన్నుల కొద్ది మట్టిని అక్రమంగా తరలించి విక్రయించి చేశారు. జీలుగుమిల్లి నుంచి కొయ్యలగూడెం వరకు వేసిన జాతీయ రహదారి నిర్మాణానికి కొందరు మధ్యవర్తులు కాంట్రాక్టర్లతో కుమ్మ క్కై మట్టిని అమ్మేసుకు న్నారు. రాత్రి సమ యాల్లో ఎక్స్‌కవేటర్ల సాయంతో మట్టిని తవ్వి టిప్పర్ల సాయంతో తరలించేశారు. అప్పట్లో ఈ మట్టి దందా జగన్ ప్రభుత్వంలో నాయకులకు కాసులు కురిపించింది. ప్రస్తు తం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇదే విధానం నేటికీ కొనసాగుతుం డడం గమనార్హం. ప్రస్తుతం కొందరు కాల్వ గట్టును కన్పించకుండా చేశారు. కొందరు గట్టును తవ్వి వచ్చిన గ్రావెల్ మట్టిని గుట్ట లుగా ఉంచి అమ్మే ప్రయత్నం చేస్తున్నారు. చింతలపూడి కాల్వ గట్టు పనులు నిలిచి పోవడంతో అధికారుల పర్యవేక్షణ కరువైంది. రాత్రి సమయంలో మట్టి తరలించే వారిపై నిఘా ఉంచి కేసులు నమోదు చేసే ప్రక్రియ మందగించింది. ఇటీవల జీలుగుమిల్లికి పూర్తి స్థాయి తహసీల్దారు లేకపోవడం, వీర్వోల కొరత, ఇన్‌చార్జుల పాలనలో రెవెన్యూ అధికారులు పని చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ బాధ్యతలు నిర్వహించాల్సి వస్తుందో అధికారులకే తెలియని పరిస్థితి. దీంతో చింతలపూడి కాల్వ గట్టు మట్టిని దర్జాగా తవ్వి తరలిస్తున్నా ఏ చర్యలు తీసుకోని పరిస్థితి నెలకొంది. అధికారులే పట్టించుకోకపోవడంతో చివరకు స్థానికులు సైతం కాల్వ గట్టు మట్టి (గ్రావెల్ లోడు)తో వెళుతున్న టిప్పర్లను, ట్రాక్టర్లను చూసి చూడనట్టు వదిలేస్తున్నారు.



దర్భగూడెంలో చింతలపూడి కాల్వ గట్టు గ్రావెల్ మట్టిని తవ్వి గుట్టలుగా ఉంచిన దృశ్యం

## ప్రజలకు ఉచిత ఇసుక అందుబాటులో ఉంచాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరుసిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో ప్రజలకు ఉచిత ఇసుక మరింత అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత ఇసుకకు ఎటువంటి కొరత లేకుండా ప్రజలకు డీసిల్టింగ్ పాయింట్లలో మరింత ఉచిత ఇసుక అందుబాటులో ఉంచేందుకు అధికారులు పరిశీలించాలన్నారు. జేసీ ధాత్రి రెడ్డి , గనులశాఖ డీడీ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

రెవెన్యూ సదస్సులలో నమోదైన అర్జీలన్నింటినీ పూర్తిస్థాయిలో పరిష్కరించాలని భూపరిపాలనా ప్రధాన కమిషనర్ జయలక్ష్మి సూచించారు. రాష్ట్ర సచివాలయం నుంచి సీసీఎల్ఏ కమిషనర్ జయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ కె.వెట్రిసెల్వి హాజర య్యారు. జయలక్ష్మి మాట్లాడుతూ నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములను పునఃపరిశీలన చేయాలన్నారు.

## రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా

రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా వ్యవస్థను మరిత పటిష్ట చేయాలని జేసీ ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్‌దుకాణాల ద్వారా బియ్యం, నిత్యావసర వస్తువుల పంపిణీపై అధికారులతో ఆమె సమీక్షించారు. ప్రతీ శనివారం 6ఏ కేసులను విచా రించి, నిందితులకు వెంటనే జరిమానా, శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారులను ఆదేశించారు. డీఎస్‌వో కె.సత్యనారాయణరాజు, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు , తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన వేగం



## నరసాపురం-విజయవాడ డబ్లింగ్‌తో తీరిన రైలు ప్రయాణికుల కష్టాలు

- విశాఖ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

1827లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం నరసాపురం-విజయవాడ రైలు మార్గాన్ని నిర్మించింది. 1962లో దీన్ని మీటర్ గ్రేజ్ నుంచి బ్రాడ్ గేజ్ అభివృద్ధి చేశారు. సింగిల్ లైన్ కావడంతో అడుగడుగునా క్రాసింగ్‌లతోప్రయాణం నరకంగా ఉండేది. ఈ మార్గంలో 139 కిలోమీటర్ల ప్రయాణానికి ఐదు గంటలు పట్టేది. రూ.4,600 కోట్లతో 2015లో డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు ప్రారంభించి 2022లో పూర్తి చేశారు. బ్రిటిష్ కాలం నాటి భవనాలు తొలగించి కొత్త స్టేషన్లు కట్టించారు. పనులు పూర్తయి రెండేళ్లు గడిచినా నేటికి ప్రారంభించలేదు. రాకపోకలు సాగుతున్నాయి. బుధవారం విశాఖ వచ్చిన ప్రధాని మోదీ అక్కడి నుంచి వర్చువల్‌గా ఈ డబ్లింగ్ పనులను ప్రారంభించారు.

నరసాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విజయవాడ-గుడివాడ-మచిలీపట్నం, గుడివాడ-భీమవరం, భీమవరం-నిడదవోలు, భీమవరం-నరసాపురం ఇలా నాలుగు ప్యాకేజీలుగా విభజించి పనులు పూర్తిచేశారు. భీమవరం నుంచి నిడదవోలు వెళ్లే మార్గాన్ని మెయిన్‌లైన్‌కు అనుసంధానం చేశారు. ఈ కారణంగా విజయవాడ నుంచి విశాఖ, కోల్‌కతా వెళ్లే రూట్‌కు ఈ మార్గం అనుసంధానమైంది. దీంతో విజయవాడ నుంచి భీమవరం, నిడదవోలు మీదుగా విశాఖ వైపు రైళ్లు దూసుకుపోతున్నాయి. గతంలో ఈ మార్గంలో గూడ్స్ రైళ్లు నడిచేవి కావు. కేవలం ఏలూరు నిడదవోలు మెయిన్ లైన్‌లో నడిచేవి. డబ్లింగ్ పెరగడంతో గూడ్స్ ట్రాఫిక్ పెరిగింది. విజయ వాడ నుంచి భీమవరం, నిడదవోలు మీదుగా మెయిన్‌లైన్‌లో గూడ్స్ రైళ్లను ఎక్కువ సంఖ్యలో నడుపుతున్నారు. దీనివల్ల మెయిన్ లైన్‌లో నడిచే ప్రధాన రైళ్లకు ట్రాఫిక్ ఇబ్బందులతోపాటు గూడ్స్ రైళ్ల సమస్య కనిపించడం లేదు. డబ్లింగ్ కావడంతో ఈ రూట్‌లో ట్రాఫిక్ పెరి గింది. హైదరాబాద్, కాకినాడ, విశాఖ, కోల్‌కతా, ఒడిశా వంటి ప్రాంతాలకు నడిచే ప్రధాన ఎక్స్‌ప్రెస్‌లు, ప్రత్యేక రైళ్లను ఈ రూట్‌లోనే నడుపుతున్నారు. ఇటు జిల్లాకు నరసాపురానికి కొత్త రైళ్లు వచ్చాయి. అందులో అమరావతి, విజయవాడ, గుంటూరులకు డెమో రైళ్లు వచ్చాయి.



ప్రారంభోత్సవం చేస్తున్న ప్రధాని మోదీ, చిత్రంలో గవర్నర్, సీఎం చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు

గతంలో విజయవాడకు నామ మాత్రంగా రైళ్లు ఉండేవి. నేడు ఈ సంఖ్య పెరిగింది.

### త్వరలో వందే భారత్

డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులతో ఈ మార్గంలో వందే భారత్ దూసుకురానుంది. చెన్నై-విజయవాడ మధ్య నడుస్తున్న వందే భారత్‌ను త్వరలో భీమవరం వరకు పొడిగించనున్నారు. నరసాపురం నుంచి బెంగళూరుకు స్లీపర్ అమృత్‌భారత్ నడిపే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. నరసాపురం నుంచి వారణాశికి కొత్త రైలును ప్రవేశపెట్టాలని ప్రతిపాదన వుంది. ప్రస్తుతం విశాఖ నుంచి నడుపుతున్న ఈ రైలును త్వరలో నరసాపురం వరకు పొడిగించే ఆలోచనలో రైల్వే అధికారులు ఉన్నారు.

### అమృత్ భారత్ స్టేషన్లు

డబ్లింగ్‌తో విజయవాడ డివిజన్‌లో జిల్లా రైల్వేస్టేషన్ల ప్రాధాన్యత పెరిగింది. ఆక్వా వంటి మత్స్య సంపద, బియ్యం ఎగుమతులతో రైల్వేకు ఎక్కువ ఆదాయం లభిస్తోంది. ప్రయాణీకుల సంఖ్య పెరగడంతో స్టేషన్లను మరింతగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. భీమవరం టౌన్, నరసాపురం, తాడేపల్లిగూడెం వంటి స్టేషన్లు మొదటి విడతలోనే అమృత్ భారత్‌కు ఎంపికయ్యాయి. ఈ మూడు పట్టణాల్లో రూ.80 కోట్లతో ఆధునిక హంగులతో స్టేషన్లను నిర్మిస్తున్నారు. పనులు చివరిలో ఉన్నాయి.

## ఎన్‌హెచ్ 365 రోడ్డు శంకుస్థాపన వాయిదా

జీలుగుమిల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి):జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ వరకు నిర్మించే జాతీయ రహదారి 365 బీటీ రోడ్డు శంకుస్థాపన బుధవారం వాయిదాపడింది. ఈ పనులను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం విశాఖ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేయాల్సి వుంది. ఆ తర్వాత జీలుగుమిల్లిలో ఎంపీ పుట్టా మహేశ్‌యాదవ్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కలిసి ఈ రోడ్డుకు శంకుస్థాపన చేయాలి. ప్రజా ప్రతినిధులకు సమ యాభావం కారణంగా వాయిదా పడినట్టు ఎన్‌హెచ్ ఏఈ కాజా చెప్పారు.

## నాలుగు రైళ్ల రాకపోకలు రద్దు

ఏలూరు క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి):రైళ్ల రాకపోకల రద్దీని నియంత్రించే ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన పనుల నేపథ్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో నాలుగు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ఒక ప్రకటనలో తెలిపారు. 17267 కాకినాడ పోర్టు నుంచి విశాఖ, 17268 విశాఖ-కాకినాడ పోర్టు, 17239 గుంటూరు-విశాఖ నడిచే రైళ్లను ఈ నెల 11న, 17240 విశాఖ - గుంటూరు ఈ రైలును 12న రద్దు చేసినట్లు పేర్కొంది.

ఆంధ్రజ్యోతి పరిశీలన

**పట్టణాలను చెత్త సమస్య పట్టి పీడిస్తోంది.. ప్రధానంగా డంపింగ్ యార్డులు లేకపోవడంతో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. కొన్ని మునిసిపాలిటీల్లో పారిశుధ్య సిబ్బంది కొరత వెంటాడుతోంది. తగినంత మంది కార్మికులు లేకపోవడంతో చెత్త సేకరణ సంపూర్తిగా జరగడం లేదు..పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలి.. చెత్త ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా డంపింగ్ యార్డుల ఏర్పాటుపై దృష్టి పెట్టాలి..**


భీమవరం శివారులో పేరుకుపోయిన చెత్త

# చెత్త కొండలు


గూడెం మైక్రో ఇరిగేషన్ చెరువు ప్రాంతంలో చెత్తగుట్ట

**పట్టణాల్లో పేరుకుపోతున్న చెత్త**
**కొన్నిచోట్ల డంపింగ్ యార్డుల సమస్య**
**ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడే డంపింగ్..**
**వెంటాడుతున్న కార్మికుల కొరత**


కూరగాయలు మార్కెట్ వద్ద పేరుకుపోయిన చెత్త

## తణుకులో కార్మికుల కొరతతో సతమతం

**తణుకు** : పట్టణంలోని పలు వార్డులో చెత్త సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు సరిపడ లేకపోవడం వల్లే సమస్య ఉత్పన్న అవుతుంది. తణుకు పట్టణంలో 34 వార్డులు ఉన్నాయి. అయా వార్డులను 72 జోన్లుగా విభజించారు. ఆయా జోన్‌లకు సంబంధించి చెత్త సేకరించేందుకు కార్మికులను కేటాయించారు. అధికారిక గణాంకాలు ప్రకారం సుమారు 207 మంది కార్మికుల అవసరం ఉంటుంది. కానీ 170 మంది కార్మికులు మాత్రమే పని చేస్తున్నారు. వీరిలో కనీసం పదిమంది వరకు సెలవుల్లో ఉంటారు. అదీకాకుండా ట్రాక్టర్ల డ్రైవర్లు, కార్యాలయంలో పనిచేసేవారు, వాటర్ సెక్షన్‌లో పనిచేసే వారు కూడా ఇందులోనే ఉంటారు. పట్టణంలోని ప్రతి రోజు 60 టన్నులు వరకు చెత్త వస్తుంది. చెత్త సేకరణకు ఏడు ట్రాక్టర్లు, 25 క్లాప్ ఆటోలు ఉన్నాయి. క్లాప్ ఆటోలో పనిచేసేవారి కాంట్రాక్టు ఫిబ్రవరితో గడువు ముగిసిపోతుంది. ఆయా ఆటోల నిర్వహణ, జీత భత్యాలుకు నెలకు 14 లక్షలు మున్సిపాల్టి చెల్లిస్తుంది.క్లాప్ ఆటోల నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం చెత్త పన్ను వసూలు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చెత్త పన్ను రద్దు చేయ డంతో మున్సిపాల్టిపై భారం పడింది. పారిశుధ్య కార్మికులను నియమించు కునేందుకు కలెక్టరు అనుమతి ఇచ్చారు. రోజుకు రూ. 500 వేతనం ఇచ్చేం దుకు రెండు సార్లు టెండర్లు పిలిచినా స్పందన లేదు.

### త్వరలోనే సమస్య పరిష్కారం



కార్మికుల కోసం ఇప్పటికే రెండు సార్లు టెండర్లు పిలిచాం. ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రత్యామ్నాయంగా పక్క మున్సిపాల్టీ నుంచి కార్మికులను తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నాం. పదిహేను రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది.

**- టి.రామ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్**

### • ఏపీ నిట్ పరిసరాల్లో డంపింగ్



**తాడేపల్లిగూడెం అర్బన్ :** తాడేపల్లిగూడెంలో రోజురోజుకు చెత్త విపరీతంగా పెరిగిపోవడంతో పజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో సుమారు 1.20 లక్షల మంది జనాభా ఉన్నారు. పారిశుద్య కార్మికులు 271 మంది ఉన్నారు. వీరిలో పర్మినెంట్ 68 మంది కాగా ఔట్‌సర్సింగ్ 203 మంది ఉన్నారు. పట్టణంలో ప్రతీ రోజు సగటున 85 టన్నుల చెత్త బయటకు వస్తున్నట్లు అంచనా. సేకరించిన చెత్తను మైక్రో ఇరిగేషన్ చెరువు గట్టు వద్ద వేస్తున్నారు. ప్రస్తుతం పట్టణానికి ఈ ప్రాంతాన్నే డంపింగ్ యార్డ్‌గా వినియోగిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. వాస్తవానికి పట్టణంలో జనాభాకు సరిపడా పారిశుధ్య కార్మికులు లేరు. ప్రస్తుతం ఉన్న వారితో పాటు అదనంగా మరో 50 మందికి పైగా అవసరం ఉంది. ఉన్న కార్మికులతో ప్రతీరోజు పట్టణంలో చెత్త సేకరణ చేయడం అధికారులకు భారంగా మారింది. పట్టణంలో ప్రతిష్టాత్మకమైన ఏపీ నిట్ పరిసరాలు కూడా చెత్తకుప్పలకు నిలయాలుగా మారిపోయాయి.జాతీయ రహదారిని అనుకుని ఉన్న ఏపీ నిట్ ప్రహరీ గోడ పక్కనే చెత్తను డంప్ చేస్తున్నారు. ఒక్కోసారి అక్కడే చెత్తకు నిప్పు పెడుతుండడంతో రహదారిపై ప్రయాణించేవారికి మాత్రమే కాదు, నిట్ ప్రాంగణంలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

### • ఆకివీడులో కార్మికుల కొరత



**ఆకివీడు :** పట్టణంలో ఏవైపు చూసినా చెత్త దర్శనమిస్తున్నది. ఇప్పటి వరకూ కనీసం డంపింగ్‌యార్డు లేదు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అదే డంపింగ్ యార్డు. పట్టణంలో అనధికార డంపింగ్ యార్డులే దర్శనమిస్తాయి. పట్టణ పరిధిలో రోజుకు 18 టన్నులు చెత్త వస్తుంది. తడి చెత్త 3 టన్నులు, 15 టన్నులు పొడి చెత్త వస్తుంది. పట్టణంలో సుమారు 40 వేల జనాభా ఉన్నారు. ఒక్కొక్క రూ.500 గ్రాములు చెత్తను ఉత్పత్తి చేస్తున్నారు. పట్టణ పరిధిలో 77 మంది పారిశుధ్య కార్మికులకు 63 మందే పనిచేస్తున్నారు. 14 మంది కార్మికుల కొరత ఉంది. దీంతో చెత్త ఎక్కడ పడితే అక్కడ కనబడుతోంది.

### • సేకరించిన చెత్త రీసైక్లింగ్ ...

**పాలకొల్లు అర్బన్ :** పట్టణంలోని 31 వార్డుల్లో సుమారుగా 68 వేల మంది జనాభా ఉన్నారు. ప్రతీ రోజు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణకు 19 వాహనాలతో పాటుగా 6 ట్రాక్టర్లు ద్వారా చెత్త సేకరణ జరుగుతోంది. ఇందుకు 140 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. రోజు వారీ సుమారుగా 42 మెట్రిక్ టన్నుల చెత్త వస్తోంది. దీనిలో తడిచెత్త 28 మెట్రిక్ టన్నులు కాగా, పొడి చెత్త 14 మెట్రిక్ టన్నులు సేకరిస్తున్నట్టు కమిషనర్ విజయ సారధి తెలిపారు. పట్టణంలో చెత్త సేకరణ 100 శాతం ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్నారు. సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసి పట్టణంలోని పార్కుల్లో వేసి చదును చేస్తున్నట్టు కమిషనర్ తెలిపారు.


చెత్త సేకరించే వాహనాలు

## ప్రధాన సమస్య కంపోస్టు యార్డు

**భీమవరం టౌన్ :** భీమవరం మునిసిపాల్టీకి డంపింగ్ యార్డు ప్రధాన సమస్యగా పట్టి పీడిస్తోంది. దీర్ఘకాలికంగా మునిసిపాల్టీకి ఈ సమస్య గుది బండగా మారింది. పట్టణంలో 39 వార్డుల నుంచి ఇంటింటి నుంచి చెత్త సేకరణ సాగుతోంది. దీనిద్వారా. రోజుకు దాదాపు 70 మెట్రిక్ టన్నుల చెత్త వస్తోంది. ఇందులో తడిచెత్త దాదాపు 28.5 మెట్రిక్ టన్నులు, మిక్సిడ్ చెత్త దాదాపు 31.5 మెట్రిక్ టన్నులు వస్తోంది. సేకరించిన చెత్తను వేసేందుకు స్థలంలేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం 100 మంది పర్మినెంట్ కార్మికులు ఉండగా 250 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఉన్నారు. వార్డుకు దాదాపు 10 మంది కార్మికలు అవసరమని అంచనా వేస్తు న్నారు. ప్రస్తుతం భీమవరం జిల్లా కేంద్రంగా మారటంతో పాటు, పరిధి పెరుగుతున్న నేపథ్యంలో పారిశుధ్యానికి మరింతమంది సిబ్బంది అవసరం అని చెబుతున్నారు. చెత్తసేకరణకు వాహ నాలను పక్కన పెట్టేయడంతో మునిసిపాల్టీ సొంతంగా పుష్ కార్టులను తయారు చేయించి తడిపొడి చెత్త సేకరణ నిర్వహిస్తోంది. ఉదయం చెత్త సేకరణ చేసినా తరువాత కొంత మంది చెత్తను రోడ్ల పై వెయ్యడంతో అపరిశుభ్రంగా మారటంతో అటు వంటి ప్రాంతాలను గుర్తించి చెత్త వేసేవారిపై నిఘా పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### ఉన్న సిబ్బందితోనే చెత్త సేకరణ



పట్టణంలో ఉన్న 39 వార్డులల్లో చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరుగుతోంది. ప్రతీరోజు ఒక వార్డులో పర్యటించి పారిశుధ్య పరిస్థితి పరిశీలిస్తు న్నాం. చెత్త బయట వెయ్యకుండా చర్యలు తీసు కుంటున్నాం. సిబ్బంది అవసరమైతే ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకువెళ్ళి ఏర్పాటు చేసుకుంటాం. కార్మికులు వచ్చినపుడు ప్రజలు తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలి.

**- కె.రామచంద్రారెడ్డి, మునిసిపల్ కమిషనర్**

## నరసాపురంలోనూ ఇదే సమస్య

**నరసాపురం :** నరసాపురం పురపాలక సంఘానికి డపింగ్‌యార్డు పెద్ద సమస్యగా మారింది. సేకరించిన చెత్తను గోదావరి ఒడ్డున పడేస్తున్నారు. అయితే ఇటీవల నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో చెత్త ఎక్కడ వేయాలో తెలియక పురపాలక అధికారులు తలలు పట్టుకుం టున్నారు. పట్టణానికి శివారున నాలుగు ఎకరాలు డపింగ్‌యార్డు నిమిత్తం కొనుగోలు చేశారు. అయితే గ్రామస్థులు ఆందోళనకు దిగడంతో ఈ ప్రతిపాదన విరమించు కున్నారు. 15 రోజుల నుంచి చెత్త ఎక్కడ వేయాలన్న దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. పట్టణంలో 31వార్డుల్లో రోజుకు 32 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. జనాభా 60 వేలు ఉండగా 17,348 నివాసాలు ఉన్నాయి. ఒక్కో మనిషి రోజుకు సగటున ఆరకేజీ చెత్త పడే స్తున్నట్లు అధికారులు అంచనా. ప్రస్తుతం పురపాలక సంఘంలో శానిటరీ విభాగంలో 33 మంది రెగ్యులర్ , మరో 91 మంది అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్నారు. ఇటీవల రోజుకు రూ.500 చెల్లించే విధంగా టీఎల్ఎఫ్ పద్ధతిలో 32 మంది కార్మికులను పెట్టుకున్నారు. అయినప్పటికి ఇంకా 60 మంది సిబ్బంది కావాల్సి ఉంది.

### స్థలం దొరికితే సమస్య తీరినట్టే..



డంపింగ్ యార్డే మునిసిపాల్టీకి పెద్ద సమస్య. సేకరిస్తున్న చెత్తను ఎక్కడ వేయాలో తెలియడం లేదు. పురపాలక సంఘానికి నాలుగైదు స్థలాలు ఉన్నప్పటికీ అవి జనావాసాల మధ్య ఉన్నాయి. అక్కడ చెత్త వేసేందుకు ప్రజలు ఒప్పుకోవడం లేదు. దీంతో అనువైన స్థలం కోసం వెతుకుతున్నాం.. ఈ సమస్య తీరితే రోజువారీ వేతనాలతో మరో 50 మందిని నియమించుకుని ఎక్కడా చెత్త సమస్య తలెత్తకుండా చూసుకుంటాం. **- అంజయ్య, కమిషనర్**


నరసాపురం రైతు బజార్ వద్ద పేరుకుపోయిన చెత్తకుప్పలు

## సెలవు రోజుల్లో వార్డులన్నీ కంపు..

**ఏలూరు టూటౌన్ :** నగరపాలక సంస్థ 50 డివిజన్స్‌లో ప్రతీరోజు 103 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. తడి చెత్త 63 టన్నులు, పొడిచెత్త 40 టన్నులు ఉత్పత్తి అవుతుంది. ఈ చెత్తను పోణంగిలోని డంపింగ్ యార్డుకు వాహనాల్లో తరలిస్తున్నారు. నగరంలో 3 లక్షల మంది జనాభా ఉన్నారు. ప్రతీ ఇంటిలో సుమారు 3 కేజీ చెత్త తయారవుతుంది. పారిశుధ్య కార్మికులు 776 మంది ఉన్నారు. కార్మికులు సరిపడినంత ఉన్నప్పటికి వీరంతా ఎక్కువ మంది విధుల్లో ఉండరనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల సొంత పనులకు కొంత మంది, ప్రజాప్రతినిధులు ఇళ్ళల్లో కొంత మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారనే విమర్శ లున్నాయి. దీంతో క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులు చేసే వారి కొరత ఏర్పడింది. ఆదివారం, పండుగ దినాల్లో కార్మికులు ఇంటికే పరిమితం కావడం వల్ల మర్నాడు కార్మికులు వీధుల్లోకి వచ్చే వరకు చెత్త అంతా కుళ్ళిపోయి దుర్వాసన రావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.


ఏలూరులో పార్కు పక్కనే చెత్త

### రోజూ స్పెషల్ డ్రైవ్



నగరంలో పారిశుధ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రతీ రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రతీరోజు ఉదయన్నే తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్‌కు తరలిస్తున్నాం. తడిచెత్తతో వర్మీకంపోస్టు ఎరువు తయారు చేస్తున్నాం. పొడిచెత్తను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెపుతున్నాం. తడిచెత్తతో విద్యుత్ తయారు చేసే ప్లాంట్‌ను నెలకొల్పడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. పారిశుధ్య కార్మికుల కొరత లేదు.

**- భానుప్రతాప్, నగరపాలక సంస్థ కమిషనర్**


జాతీయస్థాయి వర్క్‌షాపులో పాల్గొని సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

## గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో జాతీయస్థాయి వర్క్‌షాపు

దెందులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వ్యాయామ విద్యనభ్యసించే వారు తప్పని సరిగా క్రీడల నిర్వహణ, నియమ నిబంధనలు తప్ప నిసరిగా తెలుసుకోవాలని ఇండియా స్పోర్ట్ అథా రిటీ ఆఫ్ చీఫ్ కోచ్ డాక్టర్ వినాయక ప్రసాద్, డాక్టర్ సర్వోజీ అన్నారు గోపన్నపాలెం సీతా రామ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో అథ్లె టిక్స్‌లో నియమ నిబంధనలపై బుధవారం జాతీయస్థాయి వర్క్‌షాపు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అథ్లెటిక్స్ రూల్స్ అండ్ రేగ్యులేషన్స్‌పై విద్యా ర్థులకు అవగహన కలిగించారు. అనంతరం సర్టి ఫికెట్లను అందించారు, వ్యాయామ ఉపాధ్యా యులు దిలీప్, రత్నబాబు తదితరులు ఉన్నారు

## జాతీయస్థాయి సైన్సు ఫెయిర్‌కు దెందులూరు టీచరు కళ్యాణి

ఏలూరు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లాతరపున పాల్గొన్నవారిలో టీచర్స్ కేటగిరీ నుంచి దెందు లూరు జడ్పీ హైస్కూలు టీచర్ కళ్యాణి జాతీ యస్థాయి సైన్సు ఫెయిర్‌కు ఎంపి కయ్యారు. బుధవారం ముగిసిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ వివరాలను జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు తెలిపారు. జన్యు నిర్మాణం, ప్రొటీన్స్ వైద్యరంగంలో పరిశోధనల వైపు విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించడం ద్వారా, వారిని బయోటెక్నాలజీ ప్రయోగాల దిశగా ఆకర్షితులుగా చేయడానికి తాను ప్రద ర్శించిన 'ఎక్స్ట్రాక్షన్ ఆఫ్ డీఎన్ఏ' ప్రాజెక్టు ప్రోత్సా హకరంగా ఉంటుందని కళ్యాణి వివరించారు.


బహుమతి అందుకుంటున్న కళ్యాణి

విజయవాడలో బుధవారం సాయంత్రం నిర్వ హించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ బహు మతుల ప్రదానోత్సవంలో సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి నుంచి కళ్యాణి బహుమతిని అందు కున్నారు. కళ్యాణిని డీఈవో వెంకట లక్ష్మమ్మ, సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్ అభినందించారు.

## 12న చింతలపూడిలో జిల్లా స్థాయి పాటల పోటీలు

చింతలపూడి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పురస్కరించుకుని ఈనెల 12వ తేదీన ముళ్ళగిరి ఆనంద మనోహర్ మెమో రియల్ ట్రస్టు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చింతల పూడిలో జిల్లా స్థాయి సినీ పాటల పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఎం. ఇమ్మాని యేల్ తెలిపారు. పోటీలో ప్రతిభ చూపిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహు మతులు అందిస్తామని, ఉత్సాహవంతులు పాల్గొనాలని తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రజా సంఘాల కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు.

# నేడు చిన వెంకన్న గిరి ప్రదక్షిణ

### రేపు ఉత్తరద్వారంలో స్వామివారి దర్శనం

ద్వారకాతిరుమల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధమైంది. ముక్కోటి ఏకాదశి పర్వదినం ముందురోజున గిరి ప్రదక్షిణ చేయడం ఇక్కడ సంప్రదాయంగా వస్తున్నది. ఇప్పటికే ఆ మార్గాన్ని సిబ్బంది శుభ్రం చేశారు. ముళ్లపొదలు వంటివి తొలగించి బుల్‌రోజర్లతో దారిని బాగు చేశారు. శ్రీవారి పాదుకా మండపం నుంచి గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. సుమారు ఆరు కిలోమీటర్ల మేర గజ, అశ్వ, భజన మండళ్ల, కోలాటాలు, గోవింద దీక్షాదారుల స్వామి నామస్మరణలతో ఈ యాత్రను వైభవంగా జరిపేందుకు అన్ని చర్యలు తీసు కున్నారు. గిరిప్రదక్షిణ మార్గంలో ఎండుగడ్డిని ఒకపొరగా పరచి గిరిప్రదక్షిణ చేసే స్వాముల పాదాలకు రాళ్ల గుచ్చుకోకుండా చర్యలు తీసు కున్నారు. పాదయాత్రగా వెళ్లే భక్తులకు మార్గ మధ్యలో నాలుగు చోట్ల మంచినీరు, ప్రసాదం, టీ,కాఫీ, బిస్కెట్, పాలు వంటివి ఇచ్చేలా చర్యలు చేపట్టారు.వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు.ముక్కోటి రోజున వైకుంఠ వాకిళ్ల తెరు చుకుని ఉంటాయని శ్రీమహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడుకోట్ల దేవతలతో భూలో కానికి వచ్చి భక్తజనులను సాక్షాత్కరిస్తారని పండితులు చెబుతున్నారు. మూడుకోట్ల ఏకా దశులతో సమమైన ముక్కోటినాడు ఉపవాసం, జాగరణ, జపం, ద్యానం చేయడం ద్వారా పుణ్య ఫలితం లభిస్తుందని చెబుతున్నారు.


ఉత్తర ద్వార దర్శనానికి క్యూలైన్ల ఏర్పాటు


గిరి ప్రదక్షిణ మార్గంలో సేద తీరేందుకు వేసిన టెంట్లు


విద్యుద్దీప కాంతుల్లో శ్రీవారి ఆలయం

### ముక్కోటికి ముస్తాబు

అలాగే ఆలయంలో శుక్రవారం జరిగే ముక్కోటి పర్వదిన వేడుకలకు సర్వం సిద్ధమవు తోంది ముఖ్యంగా ఆరోజు శ్రీవారిని ఉత్తరద్వారం గుండా వీక్షించే క్రమంలో ఇప్పటికే ఉత్తర ద్వారా లను సిద్ధం చేశారు. ఆలయ గోపురాలు విద్యుత్‌దీపతోరణాలతో, రంగులతో ముస్తాబయ్యాయి. ఆరోజు శ్రీవారు వెండిగరుడ, శేషవాహనాలపై ఉత్తరద్వారం వద్ద కొలువై భక్తులకు దర్శన మీయనున్నారు. ఆరోజు ఉదయం 4-30 గంటల నుంచి ప్రొటోకాల్, సర్వదర్శనం, రూ.100, 200, 500 టికెట్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. గోవింద స్వాములకు, స్థానికులకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేస్తామ న్నారు. చిన్న పిల్లలకు పాలు , బిస్కెట్స్, అలాగే పెద్దసంఖ్యలో రానున్న భక్తులకు ఉదయం 10 గంటల నుంచే అన్నప్రసాదానికి అనుమతి ఉంటుందన్నారు.



### వైభవంగా శ్రీవారి తిరువీధిసేవ..

ధనుర్మాసం పురస్కరించుకుని స్వామివారు, ఉభయదేవేరులు, గోదాదేవితో కలసి క్షేత్రపురవీధుల్లో బుధవారం ఉదయం ఊరేగారు. తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్ల తో పాటు గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పా లంకరణ చేశారు. మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు.

### కాళ్ళకూరులో ఏర్పాట్లు

కాళ్ళ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని కాళ్ళ కూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తు న్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 3 గంటల నుంచి భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకునేందుకు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్టు ఆలయ కార్యనిర్వహణా ధికారి మోకా అరుణ్ కుమార్ చెప్పారు. స్వామివారి దర్శనానికి చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేస్తారని తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.


విద్యుత్ దీపాల కాంతుల్లో ఆలయం





# మోదీకి బ్రహ్మరథం


రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం




విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

## భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.


వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్

బహిరంగ సభకు హాజరైన అశేష జనం




రెండో ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రసంగిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, వేదికపై ప్రముఖులు

# తెలుగు వెలుగులు

## రాజమహేంద్రవరంలో ప్రపంచ తెలుగు మహాసభలు

రాజానగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో రెండో ప్రపంచ తెలుగు మహాసభలు బుధవారం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో ప్రధాన వేదికను ఆనుకుని తీర్చిదిద్దిన అయోధ్య రామ మందిరం నమూనా విశేషంగా ఆకట్టుకుంది. సాంకేతికతను వినియోగించి అయోధ్య బాలరాముని ఆలయం తీర్చిదిద్దినట్లు జీజీయూ ఉప కులపతి ఉదయగిరి చంద్రశేఖర్ తెలిపారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అబ్దుల్ కలాం అవతార్ (డిజిటల్) స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఎవరైనా ప్రశ్నలు అడిగితే సరైన సమాధానాలు వారి నుంచి వస్తాయని చెప్పారు.

### అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాఠశాల విద్యార్థులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో చేసిన పలు ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. ప్రధానంగా భువన విజయం, నెమలి నృత్య ప్రదర్శన, జానపద నృత్య ప్రదర్శన, కవి సమ్మేళనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.


తెలుగు మహాసభల వేదిక వద్ద అయోధ్య బాల రామ మందిరం నమూనా




అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మహాసభల వద్ద స్టాల్స్ సందర్శించిన విద్యార్థులు






సభా ప్రాంగణం వద్ద నన్నయ, కందుకూరి వీరేశలింగం, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలు

## కానిస్టేబుల్ ఎంపిక పోటీలో 313 మంది అర్హత

ఏలూరు క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా బుధవారం 1600 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్, పలు ఈవెంట్స్‌ను 313 మంది అర్హత సాధించారు. 600 మంది హాజరు కావలసి ఉండగా 459 మంది హాజరయ్యారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు పలువురు పోలీసు అధికారులు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఇచ్చిన తేదీలో హాజరుకాలేక అప్పీలు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 9న నిర్వహించే దేహదారుఢ్య పరీక్షలకు హాజరు కావాలని ఎస్పీ సూచించారు. మానూరి చంద్ర (22) పరుగుపందెంలో పడిపోవడంతో కాలికి దెబ్బతగిలింది.

### పోలీస్ శాఖలో 32 మందికి బదిలీ మెమో

ఏలూరు క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలీసుల శాఖలో పరిపాలనా సౌలభ్యం నిమిత్తం 32 మందిని మెమోతో బదిలీ చేస్తు ఎస్పీ కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణం బదిలీ అయి కొత్త పోస్టింగ్‌లలో చేరాలని పేర్కొన్నారు. ఒక ఏఎస్ఐ, 10 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు, 19 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు.

## మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబుపై కేసు నమోదు

గోపాలపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబుపై గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని మాతంగమ్మ ఆగ్రో రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచి పీడీఎస్ బియ్యం నిల్వలను రెండురోజుల క్రితం సివిల్ సప్లై అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రైస్ మిల్లులో సమారు 5 టన్నుల బియ్యం విలువ రూ.14.31 లక్షలు. సివిల్ సప్లై డీటీ తాతపూడి దివాకర్ ఫిర్యాదు మేరకు రైస్‌మిల్లు డైరెక్టర్, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబుతో పాటు మేకా శశికళ, మేకా నేతాజీ శ్రీనివాస్, తల్లాడి వరలక్ష్మి, వెలగా శ్రీరామమూర్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. లారీ డ్రైవర్ పెనుబోను శ్రీనివాస్, లారీ ఓనర్ పెనుబోను నాగదుర్గపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. లారీ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

## తప్పుడు వార్తల జగన్ మీడియాపై అంధుల నిరసన


కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంధులు

ఏలూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తప్పుడు వార్తల జగన్ మీడియాపై అంధులు నిరసన వ్యక్తం చేశారు. ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమానికి కలెక్టర్ ఆలస్యంగా రావడంతో అంధులు ఇబ్బంది పడ్డారని అసత్య కథనాన్ని ప్రచురించడంపై మండిపడ్డారు. కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. విజువల్లీ ఛాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు జీడీవీఎస్ వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.మదన్ తదితరులు మా ట్లాడారు. కార్యక్రమంలో తాము నిద్రించినట్లు చూపుతూ అంధులమైన తమ హావభావాలను అవహేళన చేసేవిధంగా ప్రచురించడంపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. అంధులు, దివ్యాంగులపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూస్తున్నారని, తమను అవమానపరిచేవిధంగా ప్రచురించిన పత్రికపై ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేస్తామన్నారు. కె.కర్ణుడు, పి.వెంకటేశ్వరరావు, కె.ఏసురాజు, మహిళా కార్యదర్శి సిహెచ్ వేళంగిణి తదితరులు పాల్గొన్నారు.

# అలసత్వం వీడండి

## అభివృద్ధి పనుల్లో అధికారుల తీరుపై ఎమ్మెల్యేల నిరసన

## వాడి వేడిగా జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మహేశ్, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, అధికారులు

ఏలూరు సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు పూర్తి చేయడం, సంక్షేమ పథకాల అమలులో అధికారులు అలసత్వం వీడాలని పలువురు ఎమ్మెల్యేలు అన్నారు. ఏలూరులోని జడ్పీ కార్యాలయంలో బుధవారం జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగిన స్థాయీ సంఘ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు పలు సమస్యలు ప్రస్తావించారు. ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పనుల్లో అధికారులు అలసత్వ ధోరణి తగదని, కాంట్రాక్టర్లతో పనులు వేగవంతంగా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తయిన అభివృద్ధి పనులు ప్రారంభించడంతో పాటు, రానున్న రోజుల్లో చేపడుతున్న రహదారుల అభివృద్ధి పనులకు ఈనెలలోనే శంకుస్థాపనలు చేసేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. విద్యుత్ శాఖపై చర్చ జరుగుతుండగా నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ సూర్యఘర్ యోజనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. పథకాల అమలును అధికారులు ఎమ్మెల్యేలకు తెలియజేయాలన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరువయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ పాఠశాల విద్య ప్రమాణాలు పెంచేదిశగా విద్యాశాఖాధికారులు కృషి చేయాలన్నారు.

### రోడ్ల పనులు పూర్తి చేయాలి : ఎంపీ

జిల్లాలో రూ. 97 కోట్లతో చేపట్టిన ఆర్‌అండ్‌బి రహదారుల అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ సూచించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారుల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కైకలూరు, పోలవరం, ఉంగుటూరు, దెందులూరు, చింతలపూడి నియోజకవర్గాల పరిధిలో 13 రహదారుల మరమ్మతు పనులు చేపట్టినట్లు చెప్పారు. పనులు పూర్తి నాణ్యతతో నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. స్థాయి సంఘ సమావేశాల్లో జడ్పీ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు, డిప్యూటి సీఈవో కె భీమేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

### అభివృద్ధి చేయండి : పద్మశ్రీ

జిల్లాలో అభివృద్ధి పనులు, రహదారుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులకు సూచించారు. రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. 3, 5, 6 కమిటీల సమావేశాలు జడ్పీ సీఈవో ఛాంబర్‌లో జరిగాయి. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, ఎమ్మెల్యేలు బడేటి చంటి), బొలిశెట్టి శ్రీనివాసరావు, పత్సమట్ల ధర్మరాజు, బొమ్మిడి నాయకర్, మద్దిపాటి వెంకట్రాజు, ఎమ్మెల్సీ గోపిమూర్తి, జడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. ఆర్‌అండ్‌బి రహదారుల పనుల పురోగతి, మంచినీటి పథకాల పనులు, కాల్వలకు నీటి విడుదల, తాత్కాలిక మరమ్మతులు, ఎంపీ ల్యాడ్స్ వినియోగం, సోలార్ విద్యుత్, జిల్లాలో సోలార్ మోడల్ గ్రామాలు, రైతులకు ఉచిత విద్యుత్, విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజన పథకం ప్రగతిపై చర్చించి అధికారులకు తగు సూచనలు చేశారు.


ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పీటీసీ సభ్యులు


జడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్, పత్సమట్ల ధర్మరాజు, బొలిశెట్టి శ్రీనివాస్

## 'పది' ప్రత్యేక తరగతులను పరిశీలించండి

- పాఠశాల విద్య డైరెక్టర్ సూచన

ఏలూరు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను డీఈవో, క్షేత్రస్థాయి అధికారులు తనిఖీ చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. బుధవారం నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఉపాధ్యాయుల ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్), కొత్తగా ఏర్పాటు చేయతలపెట్టిన స్కూల్ కాంప్లెక్స్ క్లస్టర్లు, జీవో 117 రద్దు, తదితర అంశాలపై పలు సూచనలు ఇచ్చారు. మార్చిలో ప్రారంభంకానున్న ఎస్ఎస్‌సీ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధతపై ప్రధానంగా దృష్టి సారించాలని, ముఖ్యంగా ప్రత్యేక తరగతులను ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆయన విజయ రామరాజు సూచించారు. ఏప్రిల్‌లోనే టీచర్ల సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నామని, ఇందులో భాగంగా ముందుగా అన్ని కేడర్లు, సబ్జెక్టుల్లో పదోన్నతులకు సీనియార్టీ జాబితాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, అసిస్టెంట్ డైరెక్టర్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## బతికుండగానే చంపేశారు!

### పోలవరం పరిహారాన్ని నిలిపివేసిన అధికారులు



కుక్కునూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బతికుండగానే చనిపోయననిచెప్పి బ్యాంకు ఖాతాలో జమ అయిన పోలవరం పరిహారాన్ని అధికారులు నిలిపివేశారు. కుక్కునూరు ఎ బ్లాక్ నిర్వాసితుడు షేక్ పకీర్ సాహెబ్‌కు ఆర్‌అండ్ ఆర్ పరిహారం రూ.6.36 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ అయింది. అతడు బ్యాంకుకు వెళ్ళగా ఖాతా నిలుపుదల చేసినట్లు తెలిపారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మృతి చెందిన 24 మంది బ్యాంకు ఖాతాలను అధికారులు ఫ్రీజ్ చేశారు. షేక్ పకీర్‌సాహెబ్ పేరుతో కుక్కునూరులో మరో ఇద్దరున్నారు. వారు మృతి చెందారు. అయితే అధికారులు పొరపాటున ప్రస్తుతం బతికి ఉన్న పకీర్‌సాహెబ్‌ను మృతి చెందిన వాడిగా గుర్తించి రికార్డును ఫ్రీజ్ చేశారు. దీంతో తాను బతికే ఉన్నానని, తనకు న్యాయం చేయాలని నా పరిహారం నాకు ఇప్పించండి అంటూ అతడు అధికారులను కోరుతున్నాడు.



## లారీ ఢీకొని ఒకరి మృతి


నాగు మృతదేహం

ఏలూరు క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నిలబడి ఉన్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భీమడోలుకు చెందిన బొందుల నాగు (50) బుధవారం రాత్రి ఏలూరు సమీపంలోని ఆశ్రం వద్ద బైపాస్ రోడ్డుపై నిలబడి ఉండగా లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగు భిక్షాటన చేస్తూ జీవిస్తుంటాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో బాలుడి మృతి


విద్యుదాఘాతంతో మృతి చెందిన అభయ్

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తాపీ పనిచేస్తున్న బాలుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన తాడేపల్లిగూడెం పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెంలోని కడకట్ల ప్రాంతానికి చెందిన కాళిదాసు ధన అభయ్ (16) తాడేపల్లిగూడెం శివారు మదర్‌వన్నిని ఆసుపత్రి ఎదురుగా ఉన్న భవన నిర్మాణాల్లో తాపీ పనికి వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా విద్యుత్ వైరు తెగి పక్కనే నీటిలో పడి ఉంది. అటువైపు నడిచి వెళుతున్న అభయ్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే పడిపోయాడు. వెంటనే బాలుడిని తాడేపల్లిగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అభయ్ తండ్రి శంకర్ పెయింటింగ్ పని చేస్తుంటాడు. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె చిన్న వయస్సులోనే అనారోగ్యంతో మృతి చెందింది. ఇప్పుడు కుమారుడు కూడా విద్యుదాఘాతంతో మృతిచెందగా ఆ కుటుంబం కన్నీటి సంద్రమైంది. పనులకు వెళుతూ కుటుంబానికి ఆసరాగా ఉన్న అభయ్ మృతితో వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. ఇద్దరి పిల్లలను కోల్పోయిన వారి రోదన చూపరులను కంటతడిపెట్టించింది.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, తదితరులు

## టీడీపీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

టి.నరసాపురం/కొయ్యలగూడెం జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ చేతుల మీదుగా కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు ఇంటివద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్‌తో కలిసి టీడీపీ నూతన క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, తోట లక్ష్మీనారాయణ, బొనుబోయిన సోంబాబు, గండబోయిన శ్రీను, వాసిరెడ్డి మోహన్‌రావు, శేషు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ స్వర్ణోత్సవ పోటీల్లో రాజారావుకు ప్రథమ బహుమతి


బహుమతులతో రాజారావు

ఏలూరు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కాకినాడలో నాలుగు రోజులపాటు నిర్వహించిన యూటీఎఫ్ 50 సంవత్సరాల రాష్ట్రస్థాయి స్వర్ణోత్సవాల సభల సందర్భంగా ఉపాధ్యాయులకు నిర్వహించిన ఉద్యమగీతాల పోటీల్లో సంఘ ఏలూరు నగరశాఖ ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావుకు ప్రథమ బహుమతి లభించింది. దీంతోపాటు బుర్రకథ విభాగం పోటీలో రాజారావు బృందానికి ప్రథమ బహుమతి లభించింది. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్ఎస్.ప్రసాద్ నుంచి ఆయన బహుమతులు అందుకున్నారు. ఆయనను యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

## 'విర్డ్'లో రోగులకు కృత్రిమ అవయవాలు అందజేత


రోగులకు కృత్రిమ అవయవాలను అందిస్తున్న వైద్యులు కిషోర్

ద్వారకాతిరుమల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలోని విర్డ్ ఆసుపత్రిని ప్రముఖ పెడియాట్రిక్ ఆర్థోపెడిక్ వైద్యులు కిషోర్ మూల్పూరి (కెనడా) బుధవారం పర్యవేక్షించారు. హాస్పిటల్‌ను సందర్శించిన ఆయన రోగులకు అందే వైద్యసదుపాయాలు, పరిసరాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం గుప్తా ఫౌండేషన్ చైర్మన్ ఎం.ఎం. గుప్తా సహకారంతో తయారుచేసిన కాలిపర్స్‌ను, కృత్రిమ అవయవాలను 24 మందికి ఆయన చేతుల మీదుగా అందించారు. ఆసుపత్రి చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు, ట్రస్టీలు, సుధాకర్, నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## దాతల సాయంతో పేదలకు మెరుగైన వైద్యసేవలు : చింతమనేని


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్య సంరక్షణకు దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం తానా ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. తానా సభ్యుడు డీవీ. చలపతిరావు జ్ఞాపకార్థం ఆయన భార్య సునీత ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఖండాంతరంలో ఉన్నప్పటికీ జన్మభూమిపై మమకారంతో ఇక్కడి ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రవాసాంధ్రులు అందిస్తున్న సహకారం ఎనలేనిదన్నారు. గ్రామ సర్పంచ్ పి.భాస్కరదీక్షితులు, పాఠశాల హెచ్‌ఎం శైలజ, ఎంఈవో- 2 వి.అరుణ్‌కుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.శ్రీరామ్మూర్తి, పెదకడిమి సర్పంచ్ కొసరాజు బలరామకృష్ణ చౌదరి, కొసరాజు వీరవెంకట వరప్రసాద్, చల్లగొళ్ళ గోపాలకృష్ణ, ఉండవల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఎంపీపీ పాఠశాలకు విద్యాసామగ్రి వితరణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్టేట్ బ్యాంకు విద్యా ప్రోత్సాహకంలో భాగంగా మారుమూల పేద విద్యార్థులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం నారాయణపురం గ్రామంలో ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో కొబ్బరి తోట పాఠశాలకు విద్యాసామగ్రి అందించారు. సర్పంచ్ దిడ్ల అలకనంద అధ్యక్షత వహించగా ఎస్‌బీఐ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ పథకంలో భాగంగా రూ.5లక్షలతో ప్రాథమిక పాఠశాలకు అవసరమైన కంప్యూటర్ ఇతర సామగ్రిని అందించారు. రీజినల్ మేనేజర్ నోరి, బ్రాంచి మేనేజర్ కృష్ణచైతన్య, ఎంపీటీసీ బండారు నాగరాజు, హెచ్‌ఎం పులిబంటి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐదుగురు లబ్ధిదారులకు రూ.8,85,956 సీఎం సహాయ నిధి చెక్కులను అందించారు.

## ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు పీసా కమిటీలు ఏర్పాటు చేయాలి

బుట్టాయగూడెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోని నిర్వాసితులకు ప్రత్యేక పీసా గ్రామసభ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్వాసితులు కోరుతున్నారు. బుధవారం రెడ్డిగణపవరంలో జరిగిన పీసా గ్రామసభ ఎన్నికలకు పల్లపూరు, తూటిగుంట కాలనీలకు చెందిన నిర్వాసితులు హాజరు కాకపోవడంతో పీసా గ్రామసభ ఎన్నిక నిలిచిపోయింది. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను కూడా స్థానికంగా ఉన్న గ్రామాలతో కలుపుతూ పీసా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ విధానాన్ని నిర్వాసితులు వ్యతిరేకిస్తున్నారు. తమకు ప్రత్యేకంగా పీసా గ్రామసభ ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తున్నారు. బుధవారం రెండు కాలనీలకు చెందిన నిర్వాసితులు పట్టుబట్టడంతో ఎన్నిక నిలిచిపోయింది. మండలంలో 20 గ్రామాల్లో పీసా గ్రామసభ ఎన్నికలు జరగ్గా పలు కారణాల వల్ల కోయరాజమండ్రి, కోటనాగవరం, రెడ్డిగణపవరం, పాలకుంట గ్రామాల్లో ఎన్నికలు నిలిచిపోయాయని ఎంపీడీవో కె.జ్యోతి తెలిపారు. గిరిజనులు తెలిపిన విషయాలను జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు. కామవరం, కోర్సవారిగూడెం, మోతుగూడెం, వేపులపాడు, వెలుతురువారిగూడెం, వాడపల్లి కాలనీల్లో న్యూ డెమోక్రసీ బలపరిచిన అభ్యర్థులు పీసా గ్రామసభ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## 'తల్లికి వందనం' అమలు చేయాలి

ఏలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జీవీ రాజు, ఉపాధ్యక్షుడు ఎం.సాయి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక ఎటువంటి షరతులు లేకుండా ప్రతీ విద్యార్థికి తల్లికి వందనం పథకాన్ని అందిస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్, ఎం.క్రాంతి కుమార్, సీపీఐ పట్టణ అధ్యక్షుడు జేవీ రమణ రాజు, కృష్ణ, శరణ్య, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరు ఏరువాక కేంద్రానికి ఉత్తమ అవార్డు



ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏలూరు ఏరువాక కేంద్రానికి 2023-24 సంవత్సరంలో విశిష్టమైన సేవలు అందించినందుకుగాను ఉత్తమ అవార్డు లభించింది. గుంటూరు జిల్లా లాంలోని అగ్రి వర్సిటీలో బుధవారం వైస్ చాన్సలర్ శారద జయలక్ష్మి, అగ్రి కల్చర్ డైరెక్టర్ డిల్లీరావు ఈ అవార్డును ఏలూరు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డా. కె.ఫణికుమార్‌కు అందజేశారు. - ఏలూరు సిటీ

# త్వరలో నవోదయం 2.0కు శ్రీకారం : ఎక్సైజ్ ఎస్పీ



ఏలూరు క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాల మేరకు త్వరలో జిల్లాలో నవోదయం 2.0 నాటుసారా నిర్మూలన కార్యక్రమానికి శ్రీకారం చుడతామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఎస్పీ) ఆవులయ్య తెలిపారు. జిల్లాలో 140 నాటు సారా గ్రామాలను గుర్తించామని, వీటిలో నూజివీడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 47, చింతలపూడి ఎక్సైజ్ పరిధిలో 28, జంగారెడ్డిగూడెం 24, పోలవరం 33, భీమడోలు 8 గ్రామాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. గత నెలలో సారా ఉన్న గ్రామాల్లో దాడులు నిర్వహించి 136 కేసులు నమోదు చేసి 96 మందిని అరెస్టు చేశామన్నారు. అదే విధంగా 46 వేల 570 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామన్నారు. 1,031 లీటర్ల సారా స్వాధీనం చేశామన్నారు. సారా రవాణాకు వినియోగించే 11 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామన్నారు. నాటు సారాలో పట్టుబడుతున్న పాత నేరస్తులపై బీఎన్ఎస్ఎస్ 129 కింద బైండోవర్ కేసులు నమోదు చేసి సంబంధిత తహసీల్దార్ వద్ద హాజరుపరుస్తున్నామని, ఇప్పటికే 175 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఎవరైనా సారా కల్గి ఉన్న, విక్రయించినా, తయారు చేస్తున్న వారి సమాచారాన్ని 14405కు అదించాలని సూచించారు. నవోదయం 2.0 ప్రారంభం కాబోతున్న సందర్భంలో పోలీసు అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు చేయనున్నట్లు వెల్లడించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రత్యేకప్రణాళిక రూపొందించామని, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక బృందాలు ఈనెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు దాడులు నిర్వహించి 26 సారా కేసులు నమోదు చేసి 18 మందిని అరెస్టు చేసి 171 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 10,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

## ఆరు నెలల్లో రూ.కోటి సీఎం నిధి చెక్కులు అందజేత

ఏలూరుటూటౌన్, జనవరి8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో కోటి రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పేదలకు అందజేశామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా 9మందికి రూ.11లక్షల 74వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. పెద్దిబోయిన శివప్రసాద్, చోడే వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## సహకార ఉద్యోగుల ఆందోళన

ద్వారకాతిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని సహకార ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ద్వారకాతిరుమల మండలంలో సంఘ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం తమ ఉద్యోగులకు హెచ్ ఆర్ పాలసీని అమలు చేస్తామని 2019 లోనే జీవో విడుదల చేసిందన్నారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వాలకు చెబుతున్నప్పటికీ ఈ జీవో అమలుకు నోచుకోలేదని ఉద్యోగులన్నారు. గ్రామీణ స్థాయిలో రైతులకు సేవలందించే తమకు ప్రభుత్వం, అధికారులు న్యాయం చేయాలని రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు నల్లబాడ్జీలు ధరించి విధులకు హాజరైనట్టు తెలిపారు.

## సీఆర్ఆర్ పీజీ ఇన్‌స్టెంట్ పరీక్ష ఫలితాలు విడుదల

ఏలూరు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీఆర్ఆర్ కళాశాల పీజీ 2022-24 బ్యాచ్ ఇన్‌స్టెంట్ పరీక్ష ఫలితాలను బుధవారం కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు విడుదల చేశారు. మార్కుల జాబితాలను గురువారం నుంచి కళాశాల పరీక్షల విభాగంలో విద్యార్థులకు జారీ చేస్తారని వివరించారు. ప్రిన్సిపాల్ రామరాజు, డైరెక్టర్ యలమర్తి బాబు పాల్గొన్నారు.

## పీఎంపీలకు వైద్యవిజ్ఞాన అవగాహన సదస్సు

ఏలూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏలూరు జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఆనందం సుబ్బారావు అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన సదస్సులో స్థానిక ఎస్.వి.ఎస్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు నాగరామకృష్ణ మాట్లాడుతూ అత్యవసర సమయంలో ఎముకలు, నరాలకు సంబంధించి పీఎంపీలు చేసే ప్రాథమిక వైద్యంపై అవగాహన కల్పించారు. అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శి వీటీటీ రాజు మాట్లాడారు. జిల్లా కార్యదర్శి మల్లోజు జయరామ్, దెందులూరు, ఏలూరు, భీమడోలు, ద్వారకా తిరుమల మండలాలకు చెందిన పీఎంపీలు పాల్గొన్నారు.

## నేడు, రేపు పీడీఎస్‌యూ సంక్రాంతి వ్యాసరచన పోటీలు

ఏలూరు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల, అమీనాపేట ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాలల్లో నిర్వహించనున్న సంక్రాంతి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరుగుతాయని సంఘ జిల్లా అధ్యక్షుడు కె.నాని, నగర అధ్యక్షుడు యశ్వంత్ తెలిపారు. సంక్రాంతి పండుగ విశిష్టత- మారుతున్న క్రీడా విష సంస్కృతి' అనే అంశంపై నిర్వహించే వ్యాసరచనపోటీలో పాల్గొనే విద్యార్థులు 79814 78895 నంబరులో సంప్రదించాలని కోరారు.

## నలుగురు జూదరుల అరెస్ట్

లింగపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి). పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఏఎస్ఐ రాంబాబు తెలిపారు. యడవల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో పేకాట స్థావరంపై దాడిచేసి నలుగురు వ్యక్తులను అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ.620 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.


మాజీ ఎమ్మెల్యే కొఠారు ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న కొల్లేరు లంక గ్రామస్థులు

## మంత్రి లోకేశ్ దృష్టికి కౌలు సొమ్ము వివాదం

▸▸ మాజీ ఎమ్మెల్యే ఇంటి ఎదుట కొనసాగిన లంక గ్రామస్థుల నిరసన

పెదవేగి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి చేపల చెరువుల కౌలు సొమ్ము ఇవ్వకుండా వేధిస్తున్న విషయాన్ని మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్ళామని లంక గ్రామస్థులు చెప్పారు. చెరువుల కౌలు సొమ్ము ఇవ్వాలంటూ కొల్లేరు లంక గ్రామస్థులు కొండలరావుపాలెంలోని కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి దగ్గర చేస్తున్న నిరసన బుధవారం కొనసాగింది. లంక గ్రామస్థుల నాయకులు నేతల రవి, సైదు సత్యనారాయణ మాట్లాడుతూ కొఠారు అబ్బయ్య చౌదరి చేపల చెరువుల కౌలుసొమ్ము ఇవ్వకుండా ఐదేళ్ళపాటు తనచుట్టూ తిప్పుకున్నాడని, ఇప్పుడు ఏకంగా దేశం విడిచి పారిపోయాడని ఆవేదనగా చెప్పారు. దీనిపై గత సోమవారం భీమవరం వచ్చిన మంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చి, కౌలు సొమ్ము ఇప్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశామన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లాల్సిందిగా మంత్రితోపాటు ఉన్న దెందులూరు, ఉంగుటూరు, కైకలూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, కామినేని శ్రీనివాస్‌లను కోరామన్నారు. కొరపాటి రఘురామయ్య, ఘంటసాల నాగరాజు, జయమంగళ బాలకృష్ణ, బలే చక్రవర్తి, సైదు అర్జయ్య పాల్గొన్నారు.


బర్రింకలపాడులో భారీ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

## ఘనంగా ఎమ్మెల్యే బాలరాజు పుట్టినరోజు వేడుకలు

టి.నరసాపురం/జీలుగుమిల్లి/ఏలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులో ఆయన ఇంటివద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండలం నుంచి కూటమి నేతలు బుధవారం భారీ సంఖ్యలో తరలి వెళ్ళారు. జగ్గవరం, రాజుపోతేపల్లి నుంచి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామ్మూర్తి, మాజీ జడ్పీటీసీ సభ్యులు నల్లూరివెంకట చలపతిరావు తన అనుచరులతో తరలివెళ్లగా జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు, జనసేన నాయకులతో ద్విచక్రవాహనాలు, కార్లు, ట్రాక్టర్లు, ఆటోల్లో భారీ ర్యాలీగా వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నేతలు నల్లూరి వెంకటచలపతిరావు, బొంతు సత్యనారాయణ, పిన్నమనేని మధు, ఘంటా సతీష్, పీఎస్ పవన్, బండి శ్రీనివాసరావు, లింగారెడ్డి శ్రీనివాసరావు, నాళం కాశీ, ప్రసాద్, బలుసు రవి తదితరులు పాల్గొన్నారు. బర్రింకలపాడు పుట్టిన రోజు వేడుకల సమావేశంలో ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు చిర్రి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెం పట్టణం నుంచి టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్ తదితరులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

## ఉమ్మడి జిల్లా రంగోత్సవ్ విజేతలు

ఏలూరు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దూబచర్ల డైట్ కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాస్థాయి రంగోత్సవ్-2025 పోటీల విజేతల వివరాలను డీఈవో వెంకటలక్ష్మమ్మ, ప్రిన్సిపాల్ ఎం.కమల కుమారి విడుదల చేశారు. మొత్తం 8 అంశాల్లో పోటీలు నిర్వహించగా రెండింటిలో విద్యార్థుల హాజరు లేకపోవడంతో నాలుగు అంశాలకే పోటీలు పరిమితమయ్యాయి. ప్రథమస్థానంలో నిలిచిన వారిని ఈ నెల 24న నిర్వహించే రాష్ట్రస్థాయి రంగోత్సవ్ పోటీలకు పంపిస్తామన్నారు. రాష్ట్రస్థాయి రంగోత్సవ్ పోటీలకు జిల్లా తరఫున రంగోలి పోటీకి నల్లజర్ల జడ్పీ హైస్కూలు 9వ తరగతి విద్యార్థినుల బృందం పి.దివ్యశ్రీ, డి.సింధు, బి.జ్యోత్స్న సాయిశ్రీ, ఎస్.ప్రవల్లిక, పి.కవిత ఎంపికైంది. పంజాబీ జానపద నృత్యపోటీకి నల్లజర్ల జడ్పీ హైస్కూలు 8వ తరగతి విద్యార్థిని బి.ఉదయ పోసేశ్వరి, డ్రాయింగ్ పోటీకి భీమడోలు డీపాల్ స్కూలు 8వ తరగతి విద్యార్థి టి.కరుణాకర్, క్విజ్ పోటీకి భీమడోలు డీపాల్ స్కూలు 8వ తరగతి విద్యార్థి వి.ఆదిత్య ఎంపికయ్యారు.

## దేవుని ప్రేమను ప్రజలకు పంచాలి : బిషప్ జయరావు

ఏలూరుటూటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దైవజనులంతా ఐకమత్యంగా ఉండి దేవుని ప్రేమను ప్రజలకు పంచాలని ఏలూరు కథోలిక పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ బిషప్ డాక్టర్ జయరావు పొలిమేర అన్నారు. సీఎస్ఐ చర్చి ఆవరణలో ఏలూరు సిటీ పాస్టర్స్ అసెంబ్లీ ఆధ్వర్యంలో ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ పాస్టర్ జీవన్‌కుమార్ అధ్యక్షతన పాస్టర్స్ ఫ్యామిలీ బ్యాంకెట్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడారు. కేక్‌ను కట్ చేసి ప్రేమ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్. పెదబాబు, సీపీఐ నాయకులు డేగా ప్రభాకర్, రెవరెండ్ రత్నరాజు, పెరికె వరప్రసాద్, రెవరెండ్ సీహెచ్. సుభద్రారావు, రెవరెండ్ పి.జీవన్‌కుమార్, వై.గ్రేస్‌జార్జ్, రెవరెండ్ ఎన్ఎల్.పాల్, రెవరెండ్ చిక్కాల జోసఫ్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



భోగి మంటలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే చంటి, అధికారులు.. నాగిరెడ్డిగూడెంలో సంక్రాంతి సంబరాలు

## ఉత్సాహంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

ఏలూరు రూరల్, జనవరి 8 (ఆంధ్ర జ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా స్థానిక ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్ ఆవరణలో ఇరిగేషన్, ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లా ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇరిగేషన్ ఉద్యోగులు ముఖ్యంగా మహిళా ఉద్యోగులు పాల్గొని సంప్రదాయ దుస్తులతో ఉత్సాహంగా అలరించారు. హరిదాసు కీర్తనలు, భోగి మంటలు ఏర్పాటు చేసి ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమానికి ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆలపర్తి విద్యాసాగర్, తోటా రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

**పాఠశాల, కళాశాలల్లో ..**

చింతలపూడి/ఉంగుటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నాగిరెడ్డిగూడెం గురుకుల బాలికల పాఠశాలల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం, కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో భోగి మంటలు, పాల పొంగళ్ళు, మామిడి తోరణాల అలంకరణ, రంగవల్లులు, గాలిపటాల పోటీలు, మెహందీ, మ్యూజికల్ చైర్స్ వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బ్రాహ్మణేశ్వరమ్మ మాట్లాడారు. ఉంగుటూరు మండలం ఉంగుటూరు విజ్ఞాన భారతి పాఠశాలలో కరస్పాండెంట్ పాతూరి వంశీ కృష్ణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

## ప్రభుత్వాలు రైతు ప్రయోజనాలను కాపాడాలి

ఏలూరుకార్పొరేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు ప్రయోజనాలను కాపాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. బుధవారం స్థానిక అన్నేభవనంలో ఆయన మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలను ప్రతీ రైతుకు అందిస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు అందించలేదన్నారు. రైతు సంఘ ప్రతినిధులు ఉన్నారు.

## ఘనంగా సాబ్జీ జయంతి

ఏలూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ జయంతి వేడుకలను బుధవారం ఏలూరు ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగుల సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకుడు, సాబ్జీ సోదరుడు షేక్ ఫరీద్‌ఖాసీం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తొలుత సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు ఆయన సేవలను కొనియాడారు. మానవత సంస్థ డెవలప్‌మెంట్ చైర్మన్ ఎం.అజయ్‌బాబు, దేవరపల్లి రత్నబాబు, విశ్రాంత ఉద్యోగులు టి.రామకృష్ణ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఉంగుటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఉప వైద్యాధికారి వై.వీ.లక్ష్మణరావు కోరారు. బుధవారం మండలంలోని చేబ్రోలు పీహెచ్‌సీ పరిధిలో కంసాలిగుంట, అక్కుపల్లి గోకవరంలలో ఆరోగ్య సర్వే నిర్వహించారు. గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రతి శుక్రవారం డ్రైడే డ్రైడే విధానాన్ని పాటించాలని కోరారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

## టెన్త్ విద్యార్థులపై శ్రద్ధ చూపించాలి

లింగపాలెం, జనవరి8 (ఆంధ్రజ్యోతి). టెన్త్‌లో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జిల్లా సమగ్రశిక్షా ఏపీసీ కె.పంకజ్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెం, మఠంగూడెంలో స్కూళ్లను ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ధర్మాజీగూడెంలో భవిత కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఎంఈవోలు కె.రామారావు, జె.రవీంద్ర, ఉపాధ్యాయులు బీవీఎస్ఎన్ రాజు, సజితాబేగం, సుల్తానా విద్యార్థులు ఉన్నారు.

## క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిఉన్న వ్యక్తులను గమనించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వాహనాన్ని ఏర్పాటు చేసి ఆస్పత్రికి తరలించారు. వేగివాడకు చెందిన చిట్టూరి బాబూరావు బుధవారం సాయంత్రం రహదారి పక్కన నిలబడి ఉండగా కామవరపుకోట మండలం తడికలపూడి వైపునుంచి ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చిన దెందులూరుకు చెందిన టి.బాలస్వామి అనేవక్తి బాబూరావును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడి రహదారి పక్కన పడి ఉండగా అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్ ఆగి, కారును ఏర్పాటు చేసి ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ఈమేరకు ఎమ్మెల్యే ప్రభాకర్‌ను పలువురు అభినందించారు.

## మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

టి.నరసాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ వి.విజయ్ కుమార్ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాలివి.. తిరుమలదేవిపేట గ్రామంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిల్స్ విక్రయిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో దాడిచేసి 6,500 విలువైన మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

## 800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ఏలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం గ్రామంలో నాటు సారా స్థావరాలపై జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామని సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన పీడీ

భీమడోలు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సూరప్పగూడెం గ్రామంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ శారద బుధవారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు, వసతులపై ఆరా తీశారు. కేంద్రాల పరిధిలోని గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు, తల్లులకు అందించే పౌష్టికాహారం వాటి విశిష్టతను వివరించారు. ప్రీ స్కూల్ పిల్లలతో పద్యాలు చెప్పించారు. ఐసీడీఎస్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్

## ట్రిపుల్ ఐటీకి అంబులెన్స్

నూజివీడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఎస్‌బీఐ సామాజిక బాధ్యత స్కీమ్‌లో భాగంగా అంబులెన్స్‌ను అందజేసింది. అంబులెన్స్‌ను ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ బుధవారం ప్రారంభించారు. ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## బకాయిలు విడుదల చేయాలి

ముసునూరు, జనవరి (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు జీవీ.రత్నం డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు పి.రామ రాజేశ్వరి, కె.కుటుంబరావు ఆర్థిక సహకారంతో తయారుచేసిన లంచ్ బ్యాగ్‌లు, సీఎల్ బుక్స్ క్యాలెండర్లను బుధవారం ముసునూరు జడ్పీ పాఠశాలచ ఇతర పాఠశాల్లో ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. సాయిబాబు, హరిబాబు, కొప్పుల బాబురావు, కె.నాగరాజు పాల్గొన్నారు.

## బీజేపీ మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్

ముసునూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా కాట్రేనిపాడుకు చెందిన బడుగు శ్రీకాంత్ నియమితులయ్యారు. జిల్లా రిటర్నింగ్ అధికారి రేలంగి శ్రీదేవి, జిల్లా కోర్ కమిటీ తీర్మానం ప్రకారం శ్రీకాంత్ నియామకం జరిగిందని మండల రిటర్నింగ్ అధికారి మాగంటి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు.

## రెవెన్యూ గ్రామంగా గుర్తించాలి

నూజివీడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రావిచర్ల గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌కు సర్పంచ్ కాపా శ్రీనివాసరావు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. రెవెన్యూ సదస్సులో డిఫారం పట్టా భూముల అవకతవకలు సరిదిద్దాలని కోరారు. తహసీల్దార్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి: అడవినెక్కలం గ్రామ సచివాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో వివిధ సమస్యలపై 35అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ మరియన్న, ఆర్ఐ యునస్, వీఆర్వోలు పాల్గొన్నారు.



కుడి కాల్వ పనులు

తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతు పనులు ఎప్పటికి పూర్తి చేస్తారని ఆయకట్టు రైతులు ఎదురుచూ స్తున్నారు. 6 ఏళ్ల క్రితం జైకా (జపాన్ బ్యాంకు) నిధులు రూ.16 కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు అరకొర పనులే జరగడంతో అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నవంబరులో జలాశయం కట్టపై పిచ్చిమొక్కలు తొలగించి, కుడి కాల్వ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టారు. పనులు వేగవంతం చేసి వర్షాకాలంలోపు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

# తమ్మిలేరు ప్రాజెక్ట్ పనులు నత్తనడక

### ఐదేళ్లుగా ఆగిన పనులు.. కూటమి ప్రభుత్వంలో కదలిక



తమ్మిలేరు ప్రాజెక్టు రెగ్యులేటర్ (ఫైల్)

- 2018లో రూ.16 కోట్లు మంజూరు
- ఎన్నికల కోడ్‌తో ఆగిన పనులు
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- మంత్రి పార్థసారథి చొరవతో పనులు తిరిగి ప్రారంభం

చాట్రాయి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తమ్మిలేరు ప్రాజెక్ట్ మరమ్మతు పనులకు 2018లో టీడీపీ హయాంలో రూ.16 కోట్లు మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసే సమయానికి 2019 ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులకు బ్రేక్ పడింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రివర్స్ టెండరింగ్ పేరుతో టెండర్ రద్దు చేసింది. వైసీపీ సర్కార్ 2021లో టెండరు పిలిచి కాంట్రాక్టర్‌ను ఖరారు చేసినా, కుడి కాల్వలో కేవలం రూ.1.64 కోట్లు పనులే జరిగాయి. కూటమి ప్రభుత్వంలో మంత్రి కొలుసు పార్థసారథి ప్రాజెక్టును సందర్శించి పనులు పునఃప్రారంభానికి చర్యలు తీసుకున్నారు. మంత్రి చొరవతో పనులు ప్రారంభమైనా నా వేగం పుంజుకోలేదని రైతులు అంటున్నారు. 1978లో నిర్మించిన జలాశయం మట్టికట్ట, తూములు, రెగ్యులేటర్ గేట్లు, పంట కాల్వలు, చెరువులు, కల్వర్టులు శిథిలావస్థకు చేరి పంట భూములకు నీరందక రైతులు నష్టపోతున్నారు. ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఈ పనులపై దృష్టి సారించి త్వరగా పూర్తికావడానికి చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

### పనులు వేగవంతం చేస్తాం

బి.సీతారాం, డీఈఈ, తమ్మిలేరు ప్రాజెక్ట్

తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతు పనులు వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం కుడి కాల్వ పనులు జరుగుతున్నాయి. ఎడమ కాల్వలో యడవల్లి మేజర్ పనులు ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయి. నీటి సంఘాలు, రైతులు అధికారులు సమన్వయంతో వర్షాకాలం లోపు అధిక శాతం పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం.

### పనులు వేగవంతం కావాలి



తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతు పనులకు నిధులు పుష్కలంగా ఉన్నా వివిధ కారణాల వలన పనులు నత్తనడక సాగుతున్నాయి. సుదీర్ఘకాలం మరమ్మతులు జరగక చాలా ఇబ్బందులు పడుతున్నాము. ఇప్పటికైనా పనులు వేగం పెంచి త్వరగా పూర్తి చెయ్యాలి.

**పుచ్చకాయల నేబులిరెడ్డి, రైతు చాట్రాయి**

## ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలి




వేల్పుచర్లలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా

ముసునూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకుని, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులను సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. వేల్పుచర్లలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యాక్రమంలో పాల్గొన్నారు. మొక్కజొన్న, పొగాకు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు అవగహన పెంచుకోవాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలని, సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలన్నారు. పంట వేసిన ప్రతిరైతు తప్పనిసరిగా రైతుసేవా కేంద్రంలో ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. రైతులందరూ పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మొక్కజొన్న పంటకు ఎకరాకు రూ 483, మినుముకు ఎకరానికి రూ.60, వరి పంటకు ఎకరానికి 500, మామిడికి ఎకరాకు రూ 2250 చొప్పున పంటల బీమా ప్రీమియాన్ని రైతులు చెల్లించాలని ఆయన కోరారు. సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ జి.విద్యాసాగర్, ఏవో కె.సీహెచ్ సూరిబాబు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### వ్యవసాయానికి పెద్దపీట

చాట్రాయి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసి కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. చనుబండలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని పట్టించుకకపోవటం వలన అన్నదాతలు తీవ్ర నష్టాలకు గురయ్యారని అన్నారు. చంద్రబాబు పాలనలో వ్యవసాయానికి మహర్దశ రానున్నదన్నారు. ఏఈవో ఉదయ భాస్కర్ రైతులతో కలిసి మొక్కజొన్న పైరును పరిశీలించి కత్తెర పురుగు ఎక్కువగా ఉందని గుర్తించారు. నివారణకు ఎకరానికి ఒక లీటరు వేపనూనె లేదా 5 శాతం వేప గింజల కషాయాన్ని పిచికారి చేయాలని సూచించారు. వీహెచ్ఏ సాగర్, రైతులు పాల్గొన్నారు.

## నిర్మాణం చేపట్టకపోతే స్థలాన్ని వెనక్కి ఇవ్వండి

### ఆర్డీవోకు స్థలదాత వినతి

నూజివీడు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణం నిమిత్తం ఇచ్చిన స్థలంలో నిర్మాణం చేపట్టలేదని, భూమిని వెనక్కి ఇవ్వాల్సిందిగా స్థలదాత బొబ్బిలి సునీత కోరారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి కృష్ణవిలాస్ కాలనీలో 10 సెంట్ల స్థలాన్ని బొబ్బిలి వాసు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు విరాళంగా అందించారు. కార్యాలయ నిర్మాణం చేపట్టకపోవడంపై దాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ భవనం నిర్మాణం చేపట్టకపోతే సదరు స్థలాన్ని తిరిగి తమకు అప్పగించాలని దాత బొబ్బిలి సునీత కోరారు. ఈ మేరకు ఆర్డీవోకి విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

## వైభవంగా గోదాదేవి దీపోత్సవం



ఆలయ ఆవరణలో గోదాదేవి నృత్యాల హారతులు

ఆగిరిపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి వార్ల దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం గోదాదేవి ముత్యాల హారతులు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున తిరుప్పావై పాశరాలతో అమ్మవారికి కుంకుమార్చన, నక్షత్ర హారతి కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో అమ్మ వారికి ప్రదక్షిణ, దీపోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గొబ్బెమ్మలు పెట్టి, గొబ్బెమ్మల పాటలు, కోలాట పాటలు విశేషంగా ఆకర్షించాయి. ఆలయ కార్యనిర్వహణ అధికారి సిహెచ్ సాయిపర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషబాబు, గుడిపూడి అనంతకృష్ణ, లీలామనోహర్‌లు నిర్వహించగా, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షించుకోవాలి

చాట్రాయి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భారత సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చెయ్యాలని టీడీపీ నేత మరిడి చిట్టిబాబు అన్నారు. పోలవరం కోనేరు కాలనీ పాఠశాలలో బుధవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సీనియర్ ఉపాధ్యాయుడు పగుట్ల ప్రసాద్ అందజేశారు. పోటీలలో పాల్గొన్న మహిళలందరికి మరిడి చిట్టిబాబు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మాచారి, హెచ్ఎం ఆర్.నాగేశ్వరరావు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### పేకాట శిబిరంపై పోలీసుల దాడి

చాట్రాయి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): చిత్తపూరులో పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడిచేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. రూ 40వేలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### ఏడుగురు నిందితుల బైండోవర్

నూజివీడు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నేరాలకు పాల్పడిన ఏడుగురు నిందితులను తహసీల్దార్ సుబ్బారావు ఎదుట ఎక్సైజ్ అధికారులు బైండోవర్ చేశారు. బెల్టుషాపులు నిర్వహించినా, సారా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య హెచ్చరించారు.

### 20 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోతనపల్లిలో బుధవారం జరిపిన దాడిలో 20 లీటర్ల సారా, మోపెడ్ స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. నిందితుడు డి.శ్రీనును అరెస్ట్ చేశామన్నారు.

ఆగిరిపల్లి: పోతవరప్పాడులో సింగన్నగూడెంకు చెందిన బెజవాడ రమేష్ వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. నిందితుడిని కోర్టుకు తరలించినట్లు సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు.

### మత్తు పదార్థాలతో అనర్థం

ఆగిరిపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలతో అనర్థం తప్పదని నవ జీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజరు గోళ్ళమూడి శేఖర్‌బాబు అన్నారు. మత్తు పదార్థాల వల్ల నష్టాలపై ఈదర జడ్పీ పాఠశాలలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తుపదార్థాల వల్ల ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సంబంధాలను కోల్పోతామని తెలిపారు. కె.ప్రియాంక, ఎస్.జాకబ్‌రాజు, డి.వెంకటేశ్వరరావు, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎస్.శారద, గాయత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




ఉత్తర ద్వార దర్శనానికి క్యూలైన్ల ఏర్పాటు

# నేడు ద్వారకాతిరుమల చిన వెంకన్న గిరి ప్రదక్షిణ

## రేపు ఉత్తర ద్వారంలో స్వామివారి దర్శనం

ద్వారకాతిరుమల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధమైంది. ఇప్పటికే ఆ మార్గాన్ని సిబ్బంది శుభ్రం చేశారు. ముళ్లపొదలు వంటివి తొలగించి బుల్‌రోజర్లతో దారిని బాగు చేశారు. శ్రీవారి పాదుకా మండపం నుంచి గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. సుమారు ఆరు కిలోమీటర్ల మేర గజ, అశ్వ, భజన మండళ్ల, కోలాటాలు, గోవింద దీక్షాదారుల స్వామి నామస్మరణలతో ఈ యాత్రను వైభవంగా జరిపేందుకు అన్ని చర్యలు తీసు కున్నారు. గిరిప్రదక్షిణ మార్గంలో ఎండుగడ్డిని ఒకపొరగా పరచి గిరిప్రదక్షిణ చేసే స్వాముల పాదాలకు రాళ్లు గుచ్చుకోకుండా చర్యలు తీసు కున్నారు. పాదయాత్రగా వెళ్లే భక్తులకు మార్గ మధ్యలో నాలుగు చోట్ల మంచినీరు, ప్రసాదం, టీ,కాఫీ, బిస్కెట్, పాలు వంటివి ఇచ్చేలా చర్యలు చేపట్టారు.

### ముక్కోటికి ముస్తాబు

అలాగే ఆలయంలో శుక్రవారం జరిగే ముక్కోటి పర్వదిన వేడుకలకు సర్వం సిద్ధమవుతోంది ముఖ్యంగా ఆరోజు శ్రీవారిని ఉత్తరద్వారం గుండా వీక్షించే క్రమంలో ఇప్పటికే ఉత్తర ద్వారా లను సిద్ధం చేశారు. ఆలయ గోపురాలు విద్యుత్‌దీపతోరణాలతో, రంగులతో ముస్తాబయ్యాయి. ఆరోజు శ్రీవారు వెండిగరుడ, శేషవాహనాలపై ఉత్తరద్వారం వద్ద కొలువై భక్తులకు దర్శన మీయనున్నారు. ఆరోజు ఉదయం 4-30 గంటల నుంచి ప్రొటోకాల్, సర్వదర్శనం, రూ.100, 200, 500 టికెట్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. గోవింద స్వాములకు, స్థానికులకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. చిన్న పిల్లలకు పాలు , బిస్కెట్స్ అలాగే పెద్దసంఖ్యలో రానున్న భక్తులకు ఉదయం 10 గంటల నుంచే అన్నప్రసాదానికి అనుమతి ఉంటుందన్నారు.

## తప్పుడు వార్తల జగన్ మీడియాపై అంధుల నిరసన

ఏలూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తప్పుడు వార్తల జగన్ మీడియాపై అంధులు నిరసన వ్యక్తం చేశారు. ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమానికి కలెక్టర్ ఆలస్యంగా రావడంతో అంధులు ఇబ్బంది పడ్డారని అసత్య కథనాన్ని ప్రచురించడంపై మండిపడ్డారు. కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. విజువల్లీ ఛాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు జేడీవీఎస్ వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.మదన్ తదితరులు మాట్లాడా రు. కార్యక్రమంలో తాము నిద్రించి నట్లు చూపుతూ అంధులమైన తమ హావభావాలను అవహేళన చేసేవిధంగా ప్రచురించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంధులు, దివ్యాంగులపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూస్తున్నారని, తమను అవమానపరిచేవిధంగా ప్రచురించిన పత్రికపై ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేస్తామన్నారు. కె.కర్నుడు, పి.వెంకటేశ్వరరావు, కె.ఏసురాజు, మహిళా కార్యదర్శి సిహెచ్ వేలంగిణి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న అంధులు

# సంప్రదాయ క్రీడలపై యువత దృష్టి సారించాలి



సానారుద్రవరం అవగాహన సదస్సులో సీఐ రవికుమార్

కలిదిండి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా యువత సంప్రదాయ క్రీడలపై దృష్టి సారించాలని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ అన్నారు. సానారుద్రవరంలో బుధవారం కోడిపందేలు, పేకాట జూద క్రీడల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట వంటి జూదాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. స్థలాలు, పంట భూములు ఇచ్చి జూద క్రీడలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### జూదాలవైపు మళ్ళకుండా గ్రామాల్లో అవగాహన

కైకలూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని కైకలూరు రూరల్ ఎస్సై వి.రాంబాబు అన్నారు. బుధవారం కైకలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వరహాపట్నం, సీతనపల్లి, రామవరం గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

## విద్య విజ్ఞానంతోనే సమగ్రాభివృద్ధి

మండవల్లి జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు వాస్తవికతతో కూడిన జ్ఞానాన్ని అందించడం ద్వారా వారి సమగ్రాభివృద్ధికి దోహదపడుతుందని ఉమ్మడి కృష్ణాజిల్లా మానవత కెరీర్ గైడెన్స్ చైర్మన్ ఆచార్య సుదాబత్తుల విజయకుమార్ పేర్కొన్నారు. చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ అధ్యక్షతన మానవత స్వచ్ఛంద సంస్థ మండవల్లి శాఖ అధ్యక్షుడు గుడివాడ గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. కైకలూరు మానవత సంస్థ చైర్మన్ కొండ్రెడ్డి వెంకట సత్యనారాయణ, కార్యదర్శి మండెం సత్యనారాయణ, కోచైర్మన్ గుర్రం శ్యాంకుమార్, మండవల్లి మానవత కార్యదర్శి సమయం ఏసుబాబు, సభ్యులు పాల్గొన్నారు.



గురజ హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

## టెన్త్ విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్

ముదినేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్టేట్ టీచర్స్ యూనియన్ మండలంలోని జడ్పీ హైస్కూళ్లల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తోంది. గురజ జడ్పీ హైస్కూల్ బుధవారం యూనియన్ తరపున ఎంఈవో కె.నరేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు శామ్యూల్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు పుట్టి గణేష్ బాబు సహకారంతో స్టడీ మెటీరియల్‌ను అందజేసినట్టు ప్రధాన కార్యదర్శి నాగరాజ కుమార్ తెలిపారు. హెచ్ఎం జి.కృష్ణమోహన్, యూనియన్ నాయకులు వీరమల్లేశ్వరరావు, ఎం.రజిత తదితరులు పాల్గొన్నారు.

### మ్యాథ్స్ క్లబ్ ప్రారంభం

ముదినేపల్లి జడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన మ్యాథ్స్ క్లబ్‌ను రిటైర్డ్ డీవైఈవో గన్నమనేని వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం యూటీఎఫ్ తరపున 127 మంది విద్యార్థులకు గణిత స్టడీ మెటీరియల్‌ను యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిపాటి రమేష్ పంపిణీ చేశారు. హెచ్ఎం విజయకుమార్, కానుకొల్లు హైస్కూల్ హెచ్ఎం మాధవరావు, ముదినేపల్లి డీసీ వైస్ చైర్మన్ హనుమార పేర్నీడు తదితరులు పాల్గొన్నారు.

## హైస్కూల్‌కు కంప్యూటర్ల వితరణ

కైకలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యాభివృద్ధికి నేటి సమాజంలో కంప్యూటర్లు చాలా అవసరమని వాటిని దాతలు అందించడం అభినందనీయమని సర్పంచ్ కొప్పుల కృష్ణకుమారి అన్నారు. ఆలపాడు జడ్పీ హైస్కూల్‌కు హైదరాబాద్‌కు చెందిన నాడ్ ఏంజిలియ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో రూ.6 లక్షల విలువైన 8 కంప్యూటర్లు, ప్రింటర్, ఫర్నీచర్‌ను రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి ఎర్రంశెట్టి సారథి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చేందుకు దాతలు వితరణ చేయడం అభినందనీయమన్నారు. నాడ్ ఏంజిలియ ఎడ్యుకేషన్ సభ్యులు ఎర్రంశెట్టి పాండరంగప్రసాద్, ఎర్రంశెట్టి సతీష్, కూటమి నేతలు పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, గ్రామ మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ఆలపాడు హైస్కూల్‌కు అందజేసిన కంప్యూటర్లు

## అభ్యంతరాల స్వీకరణ గడువు పొడిగింపు


కలిదిండి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కుల గణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల స్వీకరణ గడువు జనవరి 7వ తేదీతో ముగిసిందని అయితే ఈనెల 12వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు ఎంపీడీవో కొండలరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా అధికారులు నమోదు చేస్తారని, అనంతరం తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు.

## భూ సమస్యల పరిష్కారం నిరంతర ప్రక్రియ

ముదినేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం నిరంతర ప్రక్రియ అని తహసీల్దార్ సుభానీ తెలిపారు. మండలంలోని ప్రొద్దువాక, దేవపూడి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై అర్జీలను భవిష్యత్‌లోను స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. ఈ రెండు గ్రామాల్లో మూడు అర్జీలు అందాయి. రీసర్వే డీటీ శ్రీనివాస ప్రసాద్, సర్పంచ్‌లు సింగనపల్లి రామకృష్ణ, దాసరి కాశీ అన్నపూర్ణమ్మ, దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, వీఆర్వో సుధీర్ పాల్గొన్నారు.

## పీఎం సూర్యఘర్ పథకం సబ్సిడీ చెక్కు అందజేత

మండవల్లి జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా సౌరవిద్యుత్ కనెక్షన్ తీసుకునే వినియోగదారులకు సబ్సిడీతో పాటు, తక్కువ వడ్డీకి బ్యాంకు రుణం అందిస్తున్నామని, ప్రతీ ఒక్కరు సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ కెజ్యోతిప్రసాద్ సూచించారు. సూర్యఘర్ పథకం ద్వారా ఇంటిపై సోలార్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావుకు కేంద్రం నుంచి మంజూరైన రూ.78 వేలు చెక్కు (నమూనా చెక్కు)ను బుధవారం తన ఛాంబర్‌లో మేనేజర్ అందజేసి అభినందించారు. చింతపాడు గ్రామానికి చెందిన ముంగర తిరుపతి వెంకన్నకు రూ.78,000 సబ్సిడీ సొమ్మును అకౌంట్లో జమ చేసినట్టు తెలిపారు.




మండవల్లిలో పీఎం సూర్యఘర్ పథకం సబ్సిడీ చెక్కును అందజేస్తున్న దృశ్యం